# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 38 సంచిక 6

పేజీలు 44

ఫిబ్రవరి 2019

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

భద్రవాక్యం ........................................4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట........................................ 9
శ్రీబాబు బృందావన ధామము-
శ్రీ స్వామినారాయణ్
అక్షరధామము ................................11
నువ్వు ఇతరులకు సహాయం చేస్తే
భగవంతుడు నీకు సహాయం చేస్తాడు 13
నిత్యకళ్యాణం - పచ్చతోరణం ........................15
ఇందీవరుడు ........................................18
సప్తసప్తాహాల సత్సంగ సమావేశాల - విజ్ఞప్తి 20
వివేచనా శక్తిని పెంపొందించే
జెన్ కథలు............ 21
శ్రీశైల శిఖర దర్శన మహిమ ..................23
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు..........................25
శ్రీకృష్ణ కర్ణామృతము ..................................26
పరిప్రశ్న ........................................ 27
సూక్ష్మంలో మోక్షం ..................................29
కోతి ........................................31
త్యాగము .............................. ......... 33
కైవల్యోపనిషత్ ... ..................................36
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38
సత్యకాముడు ........................................40
విష్ణు కథలు ...... ............................ ..................41

# భద్ర వాక్యం

- పరాశర ప్రసాద్

## అమృతబిన్దూపనిషద్

5. **తావదేవ నిరోద్ధవ్యమ్ యావద్ హృది గతం క్షయమ్ ।**
**ఏతద్ జ్ఞానం చ ధ్యానం చ శేషోన్యాయశ్చ విస్తరః ॥**

సర్వకాల సర్వావస్థలయందూ గుర్తించినా, గుర్తించక పోయినా కాలము, అవస్థలకు, వ్యక్తులకు, కార్యములకు అతీతంగా వున్న ఉనికి సత్. ఈ ఉనికి తన ప్రకాశానికి తన జీవనానికి ఆధారమైనది చిత్. ఈ విషయాన్ని గ్రహించి గుర్తెరిగి దానిని ప్రతిక్షణము అనుభవిస్తూ జీవించటమే ఆనందం. అటువంటి జీవనము మంగళకరమైనది, న్యాయమైనది. ఇలా తత్త్వ భావంతో జీవనం సాగించే సాధకుని హృదయంలో విషయ సంకల్పాలు నిరోధింపబడటం నిశ్చయం. అయితే ఈ ప్రయత్నం తుదివరకూ కొనసాగాలి. పరిపూర్ణంగా విషయ సంకల్పాలు నశించేవరకూ విషయాసక్తిని తత్త్వభావంతో ప్రతిఘటించాలి. వేరొక మార్గం లేదు.

అయితే సాధకుడు జన్మజన్మల నుండి పేరుకుపోయిన విషయాసక్త తత్త్వాన్ని త్రోసి పుచ్చి శాశ్వతానంద స్థితికి దూరం చేస్తోంది. గ్రంథాలు ఉపనిషత్తులు. పురాణాలు ఎన్ని యదార్థమైన విషయాలను తెలియజేసినా కనువిప్పు కలగటం లేదు. నీ యదార్థ స్థితిని గుర్తెరగమని పెద్దలు, మహాత్ములు హెచ్చరించినా, బోధించినా దానిని పెడచెవినిపెట్టి 'నా స్థితి నాకు తెలుసు, నేను ఆచరించేది సరియైన మార్గము' అని తాను పొందే విషయానందమే సరియైనదనే భావనతో సరిపెట్టు కుంటాడు. అయితే ఎప్పటికైనా ప్రాపంచిక ఆనందం వెనుక పొంచివున్న దుఃఖం సాధకుని సంక్షోభంలో పడవేసి మనస్సులో మధనపడి చివరికి 'నీయమానం అయః' అన్నట్లుగా న్యాయమార్గంలో పయనించక తప్పదు కదా! తత్త్వదృష్టి కలగక తప్పదు. సాధకుని దుఃఖము ప్రత్యామ్నాయాన్ని గూర్చి ఆలోచింక తప్పదు.

# శ్రీబాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

26-1-1980

శ్రీ బాబు సత్సంగాలలో తరచుగా శ్రీ రమణ మహర్షిని గురించి చెపుతుండేవారు. ఈరోజు రమణ మహర్షి లీలలు గూర్చిచెపుతూ 'ఆయన శిష్య బృందంలో ఒక మహా పండితుడు వుండేవాడు. ఆయన శాస్త్రవాసన వున్నవారు. అదే ఆ పండితునికి అజ్ఞానమనే అడ్డుతెరగా ఉండి, సంపూర్ణ ఆత్మజ్ఞానం సంపాదించటానికి అడ్డు వచ్చింది. ఆ అడ్డు లేకపోతే ఆయనకూడ రమణ మహర్షి అంతటి గొప్పవారు. సాధారణంగా పండితులకు తావే శాస్త్రంలో గొప్పవారమనే అహంకార ముంటుంది. ఆ అహంకారమే అజ్ఞానపు ముసుగు. ఆ ముసుగు జ్ఞానం అనే వెలుగు పొందటానికి అంతరాయం అవుతుంది" అన్నారు శ్రీ బాబు.



శ్రీ బాబూజీ తమ బాల్యంలో తమకు పండితులతో కలిగిన అనుభవాలను గూర్చి చెప్పారు. "ఒకసారి బాల్యంలో మా నాన్న (పరశురామయ్య) గారి సహచరులైన శ్రీ వీరేశలింగంగారు, అప్పంభొట్లు, వుప్పులూరి ప్రభాకరరావుగారు, మరి ఇతర పండితులు కలిసి పండిత చర్చ జరుపుతూ, వారికి ఆధ్యాత్మికపరమైన శంకలు నివృత్తికాక, వారిలోవారు చర్చించుకొనే సమయంలో, వారికి ఆశ్చర్యం కల్గించే విధంగా నేను వారి సందేహ నివృత్తి చేశాను. ఆ పండితులకు కావలసిన సమాధానాలన్నీ వేదాలూ, ఉపనిషత్తులూ ఆధారంగా పుస్తకాలలో పేజీలతో సహా చెప్పాను.

అంతట ఆ పండితులకు అసూయ కలిగింది. అజ్ఞానం పొరకమ్మివారు "ఇంతటి పండితులమైన మాకు సందేహ నివృత్తిచేసిన ఈ బాలకుడు ఎవరు?" అని వెంటనే పరశురామయ్యగారిని ప్రశ్నించారు.

అంతట పరశురామయ్యగారు నాతో 'నాయనా! వారితో మనకు తగవు ఎందుకు? వారితో వాదించవద్దు. నీవు మాత్రం ఆ గదిలో కూర్చుంటే బాగుంటుంది' అని చెప్పారు. నేను "సరే నాన్నగారూ!" అని గదిలో కూర్చుని ధ్యానం చేసుకోసాగాను. నాకు అప్పుడు మాట స్పష్టంగా పలికేదికాదు. కొంచెం నంగి ఉండేది అంతటితో ఆ వ్యవహారం పూర్తికాలేదు. అహంకార పూరితులైన ఆ పండితులంతా ఏదో విధంగా నాతో శాస్త్రచర్చ జరిపి నన్ను భ్రష్టు పట్టించాలని అనుకొని ఆహ్వానించారు.

ఒక కుర్చీ వేసి కూర్చోమన్నారు. కాని నేను నాకు కుర్చీవద్దు మీరంతా పెద్దలు, పండితులు నేను కూడా క్రిందనే కూర్చుంటాను. నేను కుర్చీలో కూర్చోను  అని నిరాకరించినప్పటికీ, వారంతా నన్ను బలవంతంచేసి కుర్చీలోనే కూర్చోమన్నారు. అంతట నేను వారందరికి నమస్కరించి 'మీరంతా నన్ను కుర్చీలో కుర్చోమన్నారు కాబట్టి కూర్చుంటున్నాను' అని కుర్చీలో కూర్చున్నాను.

వెంటనే వారు శ్రీబాబూజీని బ్రహ్మ సూత్రములను గూర్చి ప్రశ్నించారు. అది వారి అహంకారం, అజ్ఞానాన్ని బహిర్గతం చేయుట మాత్రమే. శ్రీ బాబూజీ చిరునగవుతో వారిని ప్రశ్నిస్తూ  "మీరు అఖండత్వంలో ఉండి ప్రశ్నిస్తున్నారా? లేక ఖండత్వములో ఉండి ప్రశ్నిస్తున్నారా? అఖండత్వములో ఉంటే ప్రశ్న ఉదయించదు.  మీరు ఖండత్వములో ఉండి ప్రశ్నిస్తున్నట్లయితే, అఖండత్వాన్ని గూర్చి తెలుసుకొనగోరినట్లయితే, మీరు సర్వ సమర్పణ చేసుకొని నా గురుత్వాన్ని అంగీకరించాలి. నాకు పాదాక్రాంతులు కావాలి' అని శ్రీ బాబూజీ చెప్పేసరికి, ఆ పండితులకు ఏమి చేయాలో తోచక శ్రీబాబూజీని పరోక్షంగా దూషించారు. వారు తర్వాత శ్రీబాబూజీపైన ప్రయోగం కూడా చేశారు. మంత్రాలకు చింతకాయలు రాలతాయా? దివ్యజ్ఞాన సంపన్నులైన శ్రీ బాబూజీని వారు ఏమి చేయగలరు? కాబట్టి శాస్త్రజ్ఞానం ఎంత ఉన్నా ఏం లాభం? అది ఆత్మజ్ఞానాన్ని ఆనందాన్ని యివ్వగలదా?

"మహాత్ములు స్వయం ప్రకాశుడైన సూర్యుని వంటివారు. సూర్యుడు తాను ప్రకాశిస్తూ వస్తువులన్నిటికీ ప్రకాశాన్ని ఇవ్వగలుగుతాడు. వేషధారులైన పండితులు కేవలం శాస్త్రజ్ఞానం మాత్రమే కలవారు. వారు క్రొవ్వొత్తివంటివారు. క్రొవ్వొత్తి స్వయంప్రకాశముకాదు. దాని కాంతి నిత్యముకాదు. అన్ని విషయాలలోనూ ఉన్నతుడైనప్పటికి, శాస్త్రవాసనచేత

ఆత్మతత్వాన్ని తెలుసుకొనలేకపోయిన పండితుని ఆశ్రయించిన వారు ఏ రకంగా తరిస్తారు? కొంతమంది సన్యాస వేషధారులై కాని, లేక యితర విద్యల చేత కాని తామే గురువులమని, యోగులమని మోసం చేస్తారు" అన్నారు శ్రీబాబు.

శ్రీ బాబూజీకి తెలిసిన రామకృష్ణ అనబడే వ్యక్తి తానే శ్రీ బాబూజీకి గురువునని, తన శక్తినంతా శ్రీ బాబూజీకి ఇచ్చానని చెపుతూ ఉండేవాడు. ఈకోవకి చెందిన వారిలో కొందరు కలిసి, శ్రీ బాబూజీని కలుసుకోగోరిన శ్రీ కంచి కామకోటి పీఠాధిపతిని, ఆ ప్రయత్నాన్నుండి విరమింపజేయటానికి అనేక పథకాలు వేశారు. కాని అవన్నీ విఫలమయ్యాయి.

శ్రీ బాబూజీ "మహాత్ములు ఎట్టి పరిస్థితులలోనూ సహనాన్ని కోల్పోరు. నిందలు మోపిన వారిని సైతం క్షమిస్తారు. మహాత్ములు తమ ప్రాణాన్ని సైతం అర్పిస్తారు కాని దుష్టుల ప్రేరణకు అతీతులు" అంటూ శ్రీ జయదేవుని కథ వివరించారు.

"జయదేవుడు తన శిష్యులతో పల్లకీలో వెడుతూ ఉంటాడు. ఆయన జ్ఞాని. ఆయనకి పరమాత్మ ధ్యాస తప్ప మరి ఏ ఇతర వస్తువుల పైన మమకారం లేదు. ఆయన ధరించిన తులసిమాలలోని వజ్రాలు సహితం ఆయన దృష్టిని ఆకర్షించలేదు. కానుకగా వచ్చిన పైకం మూటకట్టి ఆయన శిష్యులు పల్లకీలో  ఉంచారు. అదికూడ ఆయనకు తెలియదు. ఆయనకి బాహ్యదృష్టి లేదు. అటువంటి గురువు లభించిన శిష్యులు ధన్యులు కదా!

ఆ పల్లకీ అరణ్యమార్గం గుండా పోవాలి. మహారణ్యంలో ఆ పల్లకీని మోసే బోయీలకి ధనవ్యామోహం కలిగి ఆయనను, శిష్యులను కొట్టి అక్కడే ఉన్న నూతిలో పడవేసి ఆ ధనాన్ని దొంగిలించి పారిపోయారు. అదృష్టవశాత్తు ఆ దారిని తన పరివారంతో వెళ్తున్న మహారాజు శ్రీ జయదేవుని మూలుగు విని ఆయనను ఆ పాడుబడ్డ బావినుండి తీసి, సపర్యలు చేసి, వెంటనే తన రాజ్యానికి తీసుకువెళ్ళి వైద్యసౌకర్యాలు కలుగచేసి ఆరోగ్యము చక్కబడిన తర్వాత జయదేవుని సేవిస్తూ ఉంటాడు.

శ్రీ జయదేవుని వద్ద ధనాన్ని దొంగలించిన బోయీలు తమవద్ద

ధనము ఖర్చు అయిపోగానే తిరిగి జయదేవుని వద్దకు ధనం అపహరించటానికి మాత్రమే వస్తారు. అయితే జయదేవుడు వారిని గుర్తిస్తాడు. జయదేవుని క్షమాగుణం అమోఘం. అతడు మహారాజుతో పాపం ఆ బోయీలు ధనములేక బాధపడుతున్నారు. వారికి కావలసినంత ధనాన్ని యిచ్చి పంపండి అని మహారాజుని ప్రార్థిస్తాడు. చూశారా! మహాత్ముల క్షమాగుణం ఎలా ఉంటుందో?

జయదేవుని సంస్కారానికి ఆశ్చర్యపడి ఆ దొంగలు పశ్చాత్తాపపడి జయదేవుని పాదములపై పడి క్షమించమని వేడుకొంటారు. ఆ బోయీలు క్రమేపీ జయదేవుల శిష్యబృందంలో చేరుతారు. మహాత్ములు ఆ విధంగా మట్టిని సైతం మాణిక్యంగా మారుస్తారు. వారు ప్రతి మానవునిలో పరమాత్మనే చూచుటచేత వారికి ఆ క్షమాగుణం వుంటుంది" అన్నారు శ్రీబాబు.

***ఫిబ్రవరి మరియు మార్చి 2019లలో శ్రీ మాతాజీవారి ఆశ్రమేతర సత్సంగ కార్యక్రమాలు***

3 నుండి 11 వరకు - ముంబయిలో సత్సంగ కార్యక్రమములు.

12 - శ్రీ పరమాత్మానందాశ్రమం, పెనములూరు-విశ్వశాంతియాగం

13 - బీదర్‌స్వామి శ్రీ శివానంద భారతి స్వామివారి కార్యక్రమంలో పాల్గొంటారు.

15 నుండి 19 వరకు - పెదనిండ్రకొలను బ్రాంచిలో సత్సంగ కార్యక్రమాలు. 16వ తేదీ శ్రీస్వామివారి మూర్తి ప్రతిష్ఠ వార్షికోత్సవము.

21 నుండి 25 వరకు - విశాఖపట్నంలో శ్రీదాసరి చిన్నబ్రహ్మయ్యగారి (సెల్. 99490 88052 ) ఆధ్వర్యంలో సత్సంగాలు జరుగుతాయి.

27 నుండి మార్చి 1వ తేదీ వరకు - గుండుగొలను బ్రాంచిలో వార్షిక సత్సంగ సమావేశములు జరుగుతాయి.

మార్చి 2019

5 - కామేపల్లిలో హరినామ సప్తాహాలకు హారతి.

21 - తెనాలి - అష్టమహాలక్ష్మి ఆలయంలో దండిస్వామివారి కార్యక్రమం.

23 - 30 వరకు అన్నవరంలో జరుగు హరేరామనామ సప్తాహ సత్సంగ కార్యక్రమం.

(గత సంచిక తరువాయి) **అమ్మమాట** - జపమాల ప్రసాద

ధ్యాన మూలం గురోర్మూర్తిః ।
పూజా మూలం గురోః పదమ్ ।
మంత్ర మూలం గురోర్వాక్యమ్ ।
ముక్తి మూలం గురోః కృపా ॥

విశ్వాసంతో కూడిన ధ్యానం ఒక్క నిమిషం చేసినా చాలు అన్నారు శ్రీ గురుదేవులు. అసలు మనం ధ్యానం ఎందుకు చేయాలి? అందరూ హాయిగా నిద్ర పోవాలని ఎందుకు కోరుకుంటారు? నిద్రలో మనం మన మనస్సుని, దేహాన్ని మరచిపోతున్నాము కనుక మనకు విశ్రాంతి లభిస్తోంది. అందుకని విశ్రాంతి కోసం ప్రతి ఒక్కరూ నిద్రపోవాలని కోరుకుంటారు. కానీ, ఈ విశ్రాంతి ఆ నిద్రపోయిన కాస్తసేపే వుంటోంది. మళ్ళీ నిద్రలేవగానే కథ మామూలే! ఎందుకని? శారీరక శ్రమ కాస్త విశ్రాంతి తీసుకుంటే తగ్గుతుంది. కాని మనస్సు యొక్క అశాంతి తగ్గాలంటే? అందుకనే నిద్ర లేవగానే తన పని తాను మొదలు పెట్టేస్తుంది కనుక మన అశాంతి మళ్ళీ మొదలయిపోతుంది. నిద్రలో మనస్సు అణిగి వుంటుంది కనుక మనకు కాస్త విశ్రాంతి లభిస్తోంది. కనుక మన అశాంతికి మూలం మనస్సే అని తెలిసింది. మరి దీనిని తీసివేయటం ఎట్లా? మందులు వేసుకుంటే వచ్చే శాంతి తాత్కాలికమే.



కనుక మనసుకి శాశ్వతమైన శాంతిని, ఆనందాన్ని ఇచ్చేది ఏదంటే గురులక్ష్యార్థ ధ్యానమే. మనసుకి అశాంతిని తెచ్చిపెట్టే విషయాదుల నుండి దానిని మరలించి, ఆనంద స్వరూపుడు, శాంతి ప్రదాత అయిన భగవంతుని యందు నిలిపి, ఆ భగవతత్త్వాన్ని చక్కగా విచారణ చేస్తూ, భగవన్నామ స్మరణ చేస్తూ ధ్యానం చేయాలి. ఇటువంటి ధ్యానం చేయడం ద్వారా మనస్సు అశాంతిని కలిగించే ప్రపంచ విషయాదుల నుండి మరల్చబడి శాంతిని పొందుతుంది. ఇది నిద్రలో

పొందే శాంతిలాగ కాకుండా మనం జాగ్రదావస్థలో వున్నప్పుడు కూడా అదే విశ్రాంతిని అనుభవిస్తాము. దీనినే శ్రీగురుదేవులు జాగ్రత్తలో సుషుప్తి అన్నారు. అంటే మనం జాగ్రదావస్థలో వున్నా, గాఢనిద్రలో పొందే ఆనందాన్ని పొందుతామన్నమాట. ఇక స్వప్నావస్థలోను, సుషుప్తావస్థలోను అదే శాంతిని, ఆనందాన్ని పొందుతాము. దీనినే 'నిజజాగ్రత్త' అని కూడా అంటారు.

ధ్యానమనే ప్రక్రియలో నీకాధారమైన భగవంతుని (గురుదేవుని) యందు నమ్మకం పెంచుకుని, గురులక్ష్యార్థాన్ని సాధన చేయాలి. నిరంతరం గురునామ ధ్యానం, గురుపాద (పద) ధ్యానం, గురునామ జపం, గురుతత్వ విచారణ చేయడం ద్వారా బహిర్ముఖంగా పరుగులు పెట్టే మనస్సు అంతర్ముఖ మవుతుంది. ప్రపంచంతో Detachment (వైరాగ్యం) రావాలి. భగవంతునితో Attachment (అనుసంధానం) రావాలి. అప్పుడు మనకీ ప్రపంచంలో ఎదురయ్యే ఒడిదుడుకులను, ఆటుపోటులను తట్టుకునే శక్తి వస్తుంది.

అటువంటి శక్తిని, భక్తిని, అఖండ సాధన సంపత్తిని, అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యములను, సుఖశాంతులను, భోగభాగ్యములను ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ పరమ భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు అయిన ఇందుకూరి సూరేకాంతమ్మ గారు (పాదువమామ్మ) 15-1-2019 మంగళవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరు ఆశ్రితాశ్రమంలో ఆశ్రయం పొంది వున్నారు. వీరి వయస్సు 86 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.



# శ్రీ బాబు బృందావన ధామము - శ్రీ స్వామి నారాయణ్ అక్షర ధామము



(గత సంచిక తరువాయి)

శ్రీబాబు తన పర్యటనకాలంలో అరుణాచలం వెళ్ళి శ్రీ రమణ మహర్షిని దర్శించారు. అక్కడ వారి సాన్నిధ్యంలో ఒక వారం రోజులు ఉన్నారు. శ్రీబాబుకు కలకత్తా నగరంతో ఎంతో ఆత్మీయత ఉంది. వారు కాలినడకన కలకత్తానుండి దక్షిణేశ్వరం వెళ్ళి శ్రీరామకృష్ణ పరమహంస వారి ఆరాధ్యయైన 'భవతారిణీ మా' ని దర్శించి, పగలంతా ధ్యానం చేసి, తిరిగి సాయంత్రం కలకత్తా వచ్చేవారు.



శ్రీబాబు, శ్రీరామకృష్ణ పరమహంస ఇరువురూ శ్రీకాళీమాత నిత్య దర్శనానందాన్ని; శుద్ధాద్వైత సిద్ధిని పొందిన వారే. తేలిక మాటలలో తత్త్వాన్ని పామరులకు కూడా అర్ధమయ్యేటట్లుగా బోధించిన వారే. ఇరువురూ తురీయాతీత స్థితిలో నిలిచిన రాజయోగి పుంగవులే.

శ్రీబాబు అక్కడక్కడ గ్రామాలలో మజిలీ చేసేవారు. చెరువులో స్నానం చేసి, ఏ చెట్టు క్రిందనో ధ్యానం చేస్తూ గడిపేవారు. వారిని దర్శించుకొని ఆ ఊరి గ్రామస్తులు ఆనందపడేవారు. వారి సమస్యలకు సమాధానాలు చెబుతూనే వారిలో ఆధ్యాత్మిక చింతన కలిగించేవారు. పిఠాపురం మహరాజా వారు శ్రీబాబు భక్తులు. పిఠాపురంలోనే వంగల దీక్షితులుగారనే సదాచార సంపన్నులైన బ్రాహ్మణ భక్తుల ఇంట్లో కొన్ని దినాలు ఉండేవారు. ఒరిస్సాలోని జయపూర్ మహారాజావారు శ్రీబాబు ఎడల ఎంతో భక్తి ప్రపత్తులు కలిగి ఉండేవారు. "మీరు దేశమంతా పర్యటించి శ్రమ పడుతున్నారు. తమకు నేను చక్కటి ఆశ్రమం ఏర్పాటు చేస్తాను" అని రాజావారు అంటే, "ఆశ్రమంకూడా ఒక జంజాటమే. సాధన, ధనము ఈ రెండూ ఉత్తర దక్షిణ ధృవాలవంటివి. మీరు మీ ధనాన్ని సామాన్య ప్రజలకే విద్య, వైద్యము. ఆహారం

సమకూర్చటానికి వినియోగించండి. మీరు జగన్మాత కృపకు పాత్రులు కాగలరు" అన్నారు శ్రీబాబు.

ఏ ప్రాణి అయినా ఆపదలో ఉన్నప్పుడు, భరించరాని దుఃఖంలో ఉన్నప్పుడు మహాత్ముల హృదయం ద్రవించి, లీలలు, మహత్తులు వాటంతటకి అవే జరిగి వారికి రక్షణ జరిగేది. సజ్జనులకు, భక్తులకు, ప్రాణ, మాన, హాని జరుగకుండా నివారించటమే వారి అవతార లక్ష్యము.

నీలకంఠ్ వర్ణి-

తల్లి తండ్రుల మరణానంతరం, నీలకంఠ్ తీవ్ర వైరాగ్యంతో ఏడవ ఏట తీర్థయాత్రలు చేయటానికి బయల్దేరాడు. వరదనీటితో పొంగుతున్న సరయూనదిని దాటి మొదట హరిద్వార్ చేరాడు. అక్కడనుంచి హిమాలయాలు మొదలవుతాయి. అక్కడనుండి బయల్దేరి హరిపూర్ చేరాడు. వన్యమృగాల బెడద ఎక్కువ. అక్కడ ఉన్న ఆలయ అర్చకుడు ఆలయం లోపలకు వచ్చి తల దాచుకోమన్నాడు. నీలకంఠ్ ససేమిరా అని ఒక చెట్టు క్రింద తపస్సు చేయటం మొదలుపెట్టాడు. రాత్రి అయింది. ఒక సింహం వచ్చి అతని పాదాలను నాకటం మొదలుపెట్టింది. నెమ్మదిగా అతనికి చేరువగా వచ్చి కూర్చుంది. అక్కడ ఆశ్రమ వాసులందరూ ఎంతో ఆశ్చర్యపడ్డారు. ఉదయం నీలకంఠ్ చెయ్యి ఊపగానే వెళ్ళిపోయింది. ఆలయ పూజారి పరిగెత్తుకుంటూ వచ్చి ఈ 11 ఏళ్ళ బాలుడికి పాదాభివందనం చేశాడు. ఆ ఆలయానికి అర్చక స్థానం ఇచ్చి అక్కడే ఉండమన్నాడు. తాను వచ్చింది మోక్ష ప్రాప్తి కొరకని చెప్పి ఆయన ప్రస్తావనను త్రోసిపుచ్చాడు.

కేదారనాథ్ నుండి కొండలు ఎక్కుతూ దిగుతూ దీపావళి నాటికి బద్రీనాథ్ చేరాడు (అక్టోబర్ 1792). అక్కడ అర్చకస్వామి నీలకంఠ్ దివ్యత్వాన్ని గ్రహించి, అతనికి ప్రసాదం ఇచ్చి ఇలా అన్నాడు,"ఇక ఇక్కడ అంతా మంచు కప్పివేస్తుంది. ఆలయ గుడి తలుపులు మూసివేస్తారు. నర నారాయణమూర్తులను ఏనుగ అంబారీలో ఊరేగిస్తూ జోషీమఠ్‌కు తీసుకు వెళ్తారు. నువ్వుకూడా జోషీమఠ్‌కు వచ్చెయ్యి." నీలకంఠ్ ఆయన ప్రస్తావనను స్వీకరించి జోషీమఠ్‌కు దిగి వచ్చాడు. కాని అక్కడ వుండటానికి నిరాకరించాడు.

-సశేషం

# నువ్వు ఇతరులకు సహాయం చేస్తే భగవంతుడు నీకు సహాయం చేస్తాడు

- రమణ ప్రసాద్

"నువ్వు ఇతరులకు సహాయ పడు. భగవంతుడు నీకు సహాయం చేస్తాడు. ఎల్ల వేళలా భగవంతుడిని నమ్ము" అని నాకు మా నాన్నగారు చెప్పేవారు. ఆయన జమీందారు. తన భూములను పేద రైతులకు సాగుకు ఇచ్చి డబ్బు గడించేవాడు.

'నాన్నగారూ ! మీరు చెప్పింది నాకు ఎలా ఉపయోగపడుతుంది? అని అడిగతే ఆయన చిరునవ్వు నవ్వి ఉరుకున్నారు.

'డాక్టర్‌గారు ఏమన్నారు?' అని నా భార్యను అడిగాను. 'మన పాప చనిపోయింది. ఇది రెండవ సారి గర్భ స్రావం' ? అని తన తలను నా గుండెలకు హత్తుకుని రోదించింది. నేను స్వర్గంలో ఉన్న నా తండ్రివైపు పైకి చూసి ఏడుపును ఆపుకుంటూ నవ్వాను. నా పేరు 'గోపీ.' నేను ఒకరి ఇంట్లో పరిచారకుడిని. మాకు ఉన్న భూములన్నీ బంధువురొకరి వల్ల హరించుకు పోయాయి. మా తండ్రి గారు చనిపోవటంతో నిర్ధనులమైనాము.

ఇంతలో ఇంటి యజమానురాలైన సుమన్ గారు వచ్చి, 'గోపీ! ఆ కార్పెట్‌ని మా అమ్మాయి అనిత పాడు చేసింది. దానిని శుభ్రం చెయ్యి.' అన్నారు. (ఆమె భర్త యాక్సిడెంట్‌లో మరణించారు. ఆమె స్థానీయ బ్యాంక్‌లో క్యాషియర్‌గా ఉద్యోగం చేస్తున్నారు.) 'నేను డాక్టర్‌గారిని కలవడానికి హాస్పిటల్‌కు వెళ్తున్నాను' అని చెప్పి ఆమె వెళ్లిపోయారు.

నేను కార్పెట్‌ను శుభ్రం చేస్తుంటే దానిక్రింద ఏదో వస్తువు గట్టిగా తగిలింది. దానిని తీసి చూస్తే అది ఒక చిన్న పెట్టె. దానికి హ్యాండిల్ కూడా ఉంది. నాకు భయం వేసింది. ధైర్యం చేసి ఆ పెట్టెను తెరిచాను. ఆపెట్టెలో ఎన్నో బంగారు నగలు, వజ్రాలు, రత్నాలు ఉన్నాయి. నా కళ్లను నేనే నమ్మలేకపోయాను. మా తండ్రి గారు చెప్పినట్లుగా 'ఈ విధంగా నాకు భగవంతుడు సహాయంచేస్తున్నాడా?' అనిపించింది. నాలో ఎన్నో ప్రశ్నలు మొలకెత్తాయి. నాకు ముచ్చెమటలు పట్టాయి. నేను ఏం చెయ్యాలి? ఇప్పుడు ఈ పెట్టెను తీసుకోవాలా? వద్దా? ఎంతో ఆలోచించి చివరకు ఆ పెట్టెను తీసుకొని ఇంటికి వెళ్లాను.'

'నీకు ఏమైనా పిచ్చి పట్టిందా గోపీ? వాళ్లకు తెలిస్తే నిన్ను జైల్‌లో వేస్తారు" అంది ఆ పెట్టెను చూసి. 'ఎవ్వరికీ ఈ పెట్టెను గురించి తెలియదు. తెలిస్తే నన్ను ఆ కార్పెట్‌ను ముట్టుకోనిచ్చేవారుకూడా కాదు.' అన్నాను. 'అయితే ఈ సొమ్ము ఎవరిదై ఉంటుంది?' అని అడిగింది నా భార్య. 'ఆ ఇంట్లో సుమన్ గారి ముందు ఒక వృద్ధ దంపతులు ఉండేవారు. వారు చాలా ధనవంతులు. ఇది వారిదై ఉంటుంది.' అన్నాను. 'గోపీ! ఇది మనకి చెందని దానిని మనం తీసుకోకూడదు. ఇప్పుడు వుంటున్న వారికే ఈ పెట్టెమీద హక్కు ఉంది. దానిని వెళ్లి ఇచ్చేసి రా!' అంది నా భార్య.

'లేదు. భగవంతుడు నాకిదిచ్చాడు. నేను దీనిని తిరస్కరించను. ఇదివరకే నాకు ఎంతో అన్యాయం జరిగింది. ఇప్పుడు భగవంతుడిచ్చిన దానిని వదులుకోమంటావా?' అన్నాను. ఆమె నా చేతులు పట్టుకొని, 'ఈ పెట్టె ఇచ్చేసిరా!' అని బ్రతిమాలింది. ఆమె వైపు చూశాను.

సుమన్ గారు ఈ పెట్టెను తీసుకొని ఏడవటం మొదలు పెట్టారు. ఏడుస్తూనే నాకు కొన్ని వందల సార్లు ధన్యవాదాలు తెలియజేశారు.. 'గోపీ! నాకు ఇప్పుడు ఎంత ఆనందంగా ఉందో మాటలలో తెలియచేయలేను. (నేను మౌనంగా ఆమె చెప్పేది వింటున్నాను) నువ్వు నా బిడ్డను కాపాడావు. అనితకు గుండెలో రంధ్రం ఉన్నదనీ, ఆపరేషన్‌కు ఒకటిన్నర కోట్ల రూపాయిలు అవుతాయని డాక్టర్‌గారు చెప్పారు. నాకు ఈ విధంగా సహాయం చేశావు.' అన్నారు. ఆనంద భాష్పాలు జాలువారుతుండగా నేను నా ఇంటివైపు మరలాను. ఒక శుభ దినాన మాకు ఒక పుత్రుడు కలిగాడు. 'ఇతనికి మీ తండ్రిగారి పేరు **రామ్** అని పెడదామండీ' అంది నా భార్య.

'నువ్వు ఇతరులకుసహాయం చేస్తే నీకు భగవంతుడు సహాయం చేస్తాడు. ఎల్ల వేళలా భగవంతుడిని నమ్ము' అని నా తండ్రి అనడం, నేను, 'నాకు మీరు చెప్పింది ఎలా ఉపయోగ పడుతుంది?' అని అడిగితే ఆయన చిరునవ్వు నవ్వడం గుర్తుకొచ్చాయి. ఆయన మాటలలో నిజాన్ని గ్రహించాను. స్వర్గంలో ఉన్న మా తండ్రిగారివైపు కృతజ్ఞతతో చూశాను.

# నిత్య కళ్యాణం – పచ్చతోరణం

(శ్రీ మాతాజీ ప్రసంగాల నుండి) - రమణ ప్రసాద్

మానవుడు సంసార విషయాలలో మునిగి తనను తాను గుర్తించే ప్రయత్నం లోపించటంతో భగవంతుడే తాను ఒకరూపం ధరించి వచ్చి మనలో ఒకరై మనలను సన్మార్గంలో నడిపిస్తున్నారు. వారు అందరివారు, అందనివారు కాదు. వారు సర్వజ్ఞులు. ఆయన మన మధ్యకు వచ్చి అన్నీ చేసి చూపించారు. అక్కడ వంట అవుతుంటే, వారు అక్కడికి వచ్చి, ఏమిటమ్మా ఆ చేయుటం? పచ్చి మిరపకాయి వేయిస్తే బాగుంటుందా? దానిని నిప్పుమీద కాల్చి వెయ్యాలి. అదీ పచ్చి పులుసంటే. తుడిచేవాళ్ళతో, 'అక్కడ తడి ఆరలేదు' అనేవారు.

నాకు మా నాన్నగారు ఇచ్చిన దేవతార్చన స్వామి (బూబూజీ) ద్వారా వచ్చింది. దానికి రోజూ పూజ చేసేదానిని. మూడులో (విజ్ఞాన మందిర్ మూడవ అంతస్తులో) గోడ ప్రక్కగా తుడిచి, తడిగుడ్డ పెట్టి, ముగ్గువేసి, పీటమీద దేవతార్చన పెట్టి రోజూ పూజ చేసుకొనేదానిని. స్వామి పిలిస్తే, 'దేవుడా! ఉండు, ఇప్పుడే వస్తాను' అని స్వామి వద్దకు పరిగెత్తేదానిని. ఆ రోజులు తల్చుకుంటే ఎంతో తృప్తి ఆనందం కలుగుతుంది. అట్టి దివ్య చరణారవిందాలు మనకు లభ్యమయ్యాయి. అవి -

**చరణాలు చరణాలు ముక్తి సోపానాలు ।**
**శరణన్న వారికవి మోక్షభవనాలు ॥**

మానవుడు ఆశకు బానిసై వ్యర్థంగా కాలం వెళ్ళబుచ్చుతూ తనకు మరణ సమయం ఆసన్నమవుతున్నదన్న విషయాన్ని మరుస్తున్నాడు. శ్రీగురుదేవులు చెప్పిన కోతి కథలో కోతులు పట్టేవాడు పెట్టిన సన్నమూతి కుండలో పప్పులకోసం చెయ్యిపెట్టి గుప్పిటతో పప్పులు పట్టుకుని గుప్పిటమూసి ఉంచి, కోతులు పట్టేవాడు రావటంతో చెయ్యి బయటకు రాకపోతే 'నా చెయ్యి లోపల ఎవరో పట్టుకున్నారనుకొని' వాడి చేతికి చిక్కుకొంది. ఎందువలన? ఆశ వల్ల.

అలాగే మనకి దుర్లభమైన మానవజన్మ వచ్చింది. దానిని ఎంతమంది సద్వినియోగం చేసుకుంటున్నాం? దానిని మనకు వుపయోగించుకోవటం రావటంలేదు. పూజ ఒకటే సరిపోదు. నువ్వు పూజ చేసే పువ్వులు ఎవరు పూయించారు? దేవుడు కదా!. ఆ దేవుడిచ్చిన ధనంతో పూజ సామాగ్రి, ప్రసాదాలు వచ్చాయి కదా! మనం

పూజించాల్సింది మనోపుష్పంతో. ఆ పుష్పం వాడనిది, వీడనిది. అది వాడితే నీ ఉనికే లేదు. వాసనా రహితం అయితే ఆ పుష్పంలో ప్రకాశించేది గురుదేవుడే! అనంతుడు, అనంత ప్రకాశ స్వరూపుడు. ఆ పుష్పమే ముక్తి సోపానం. అదే మోక్ష భవనం.

శ్రీ అమరేశ్వర శాస్త్రిగారు హాస్పిటల్‌లో ఐ.సీ.యు లో వున్నప్పుడు, వారు మానసికంగా సద్గురు పాదపూజ చేసికొని, **'అకాల మృత్యుహరణం, సర్వ వ్యాధి నివారణం। శ్రీ సద్గురు పాదోదకం పావనం శుభం॥** అని మళ్ళీ **శ్రీ చంద్ర కాళీ మాతాజీ పాదోదకం పావనం శుభం'** అని అక్కడి వారిని వచ్చి తీర్థం తీసుకొమ్మన్నారుట. వారికి 86 సంవత్సరాలు. అంత్యకాలం వరకు మృదంగ, డోలక్ వాద్యాలు వాయించి గురుసేవ చేసుకొన్నారు. గురుసేవతో పాటు వారు సాధన చేసుకుంటూ ఆ సాధనలో ఊరి ఊరి తన జన్మ సార్థకత చేసుకున్నారు.

మనం చేసిన శ్రవణం ద్వారా మనం ఇప్పుడు గోదాదేవి కళ్యాణానికి రెడీ అయిపోయాము. ఇప్పుడు రుక్మిణీ కళ్యాణాన్ని తిలకించబోతున్నాము. ఆ లక్ష్మీ నారాయాణులను నిత్యం తలుచుకోవటం వల్ల మనకు నిత్యం భోగమే. ఆ కళ్యాణ పురుషోత్తముడిని మనసులో భావనచేసిన ప్రతి క్షణమూ మనకి పండగే. పువ్వులోని బొడ్డు భగవంతుడు అయితే, మనమంతా ఆ బొడ్డుకి అంటుకున్న రేకులము. దేవుడు పురుషోత్తముడు. జీవుడు ప్రకృతి.

ఇక్కడ నిత్య కళ్యాణం, పచ్చ తోరణం. ప్రతి సంవత్సరం మనకు గురుదేవులు ప్రసాదించిన మహదవకాశం. ఆయన సృష్టించిన ప్రకృతి ఆయనలో ఉండటమే '**జీవబ్రహ్మైక్యానుసంధానం**' అంటే. మనం ఆయనను వరించే ఉన్నాం. కాకపోతే గుర్తింపు రావాలి. ఎంత లోతుగా విచారణ చేస్తే, అంత ఆనందాన్ని పొందుతాం. కొందరు 'ఆంఫట్' అని స్పీడ్‌గా భోంచేస్తారు. వాళ్ళని నిదానంగా తినమన్నారు. నిదానంగా తినేవారిని కాళ్ళారేలోపల భోజనం ముగించాలి అన్నారు. బాబు 'ఏమిటయ్యా! ఎలా వడ్డిస్తున్నారు? కూరలు వడ్డించండి. అందులో కాస్త పప్పో. పులుసో కలుపుకొని తినవయ్యా' అనేవారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం. అన్నానికి ముఖ్యమైన స్థానం ఇచ్చింది తైత్తిరీయోపనిషత్తు. **'అహమన్నం అహమన్నం అన్నాద్ భవన్తి భూతాని'**. అన్నం నీకు రూపాన్ని ఇస్తుంది. అన్నం చేత నువ్వు పోషింపడుతున్నావు.

రామకృష్ణ పరమహంస వివేకానందుడితో 'ఒక గిన్నెనిండా అమృతం ఉంటే దానిని ఎలా స్వీకరిస్తావు?' అని అడిగితే. 'గిన్నె అంచుపైనించి' అని ఆయన అన్నారుట. 'పిచ్చివాడా అది అమృతం కదా! అందులో మునిగితే మిగిలేది ఆనందమే కదా!' అన్నారుట శ్రీ రామకృష్ణ పరమహంస. ఆ ఆత్మ ఎటువంటిది? అంటే సమాధానం చెప్పినవాళ్ళు ఎవరూ లేరు.

**ఆశ్చర్యవత్ పశ్యతి కశ్చిదేనం,ఆశ్చర్యవద్వదతి తథైవచాన్యః।**
**ఆశ్చర్యవచ్చైన మన్య శృణోతి, శ్రుత్వాప్యేనం వేద నచైవ కశ్చిత్॥**

"ఈ ఆత్మను ఒకడు ఆశ్చర్యంగా చూస్తున్నాడు. ఇంకొకడు ఆశ్చర్యంగా వర్ణిస్తున్నాడు. వేరొకడు ఆశ్చర్యంగా వింటున్నాడు. కాని ఒక్కడూ దానిని గురించి చెప్పలేకపోతున్నాడు." ఎందుకంటే అది కేవలం అనుభవైకవేద్యం. దీనికి శ్రీగురుదేవులు పంచదారను ఉపమానంగా చెప్పేవారు. పంచదార తియ్యగా ఉంటుంది. పలుకులు పలుకులుగా ఉంటుంది అంటే దాని రుచి ఎలా తెలుస్తుంది. దానిని నోట్లో వేసుకున్నవాడిని అడిగితే 'నువ్వుకూడా తిని చూడు' అంటాడు. పంచదార పలుకును పట్టుకున్న కండచీమను దానినుండి విడదీయటానికి ప్రయత్నిస్తే, తన తల ఉడిపడుతున్నా సరే దానిని వదిలిపెట్టదు. ఆత్మ తనకంటే భిన్నంగా లేదు. అది తన స్వరూపమై వున్నది. అలా శ్రీ గురుదేవులు ఇంతటి మహదవకాశాన్ని మనందరికీ ఇచ్చి, 'దీర్ఘ సుమంగళీ భవ' అని దీవించి, మనను 'సర్వమంగళ' గా చేసిపెట్టారు. ఎవరయితే ఆ భగవంతుని దివ్య చరణాలు పట్టుకొని ఉన్నారో, వారి జీవితం 'సర్వమంగళ' మవుతుంది. మనస్సు ఎగురుతూ ఉంటుంది. దానిని ఎగరనివ్వండి. మీరు దానికి సాక్షిగా ఉండండి.

అటువంటి దివ్య చరణాలను 'సూత్రాలు' గా ఒకరు, ఇంకొకరు భక్తి పరంగా, వేరొకరు జ్ఞానపరంగా భావిస్తారు. అటువంటి దివ్య చరణారవిందములు మనందరికీ అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యములను, అఖండ భోగ భాగ్యాలను ప్రసాదించి సర్వదా కాపాడుగాక! సుఖీభవ!!

# ఇందీవరుడు

- మురళి

అది శ్రీ ప్రబోధానంద స్వామివారి ఆశ్రమం. ప్రశాంతమైన వాతావరణం. శిష్యులందరూ సమావేశమై కూర్చున్నారు. స్వామి శ్రీదేవీ మహాత్మ్యం గురించి వివరిస్తున్నారు. జగన్మాత మహిషాసురుణ్ణి వధించిన ఘట్టాన్ని వివరిస్తూ సమాధి స్థితులయ్యారు. అప్పుడప్పుడూ స్వామి శిష్యులకు బోధిస్తున్న సమయంలోనే సమాధి స్థితులవటం జరుగుతూ వుంటుంది. అందువలన శిష్యులు మౌనంగా కూర్చున్నారు. కొంతమంది శిష్యులు ధ్యానం చేసుకోవటంలోను, కొంతమంది పఠనంలోను మునిగి వున్నారు. సమాధి స్థితిలో ప్రబోధానంద స్వామి వారికి జగన్మాత దర్శనం కలగటంతో వారి ముఖంలో తేజస్సు ప్రస్ఫుటమౌతోంది. మరి కొంతసేపటికి స్వామి సమాధి స్థితి నుండి సాధారణ స్థితికి వచ్చారు.

స్వామి తన ముందు కూర్చుని వున్న శిష్యులందరినీ తేరిపార చూస్తున్నారు. వారిలో ఇందీవరుడు అనే శిష్యుని ముఖంలో అలౌకిక ఆనందం, తేజస్సు కనిపించటంతో, 'ఇందీవరా! ఏమిటి విశేషం?' అన్నారు. ఇందీవరుడు సమాధానమిస్తూ, 'గురుదేవా! తమ దివ్యానుగ్రహంతో జగన్మాత దర్శనం అయింది' అని చెప్పాడు. ఏమి చూశావో కాస్త వివరంగా చెప్పు అన్నారు స్వామి. ఇందీవరుడు తిరిగి మాట్లాడుతూ, 'గురుదేవా! నాలుగైదు రోజుల నుండి జగన్మాతను చూడాలని ఎంతో ఆర్తిగా వుంది. నిత్యం ధ్యానం చేసుకుంటూ అమ్మా! నీ దివ్య దర్శనం అనుగ్రహించు అని ఆర్తిగా విలపిస్తున్నాను. అమ్మను వేడుకుంటున్నాను. ఈ రోజు ధ్యానం చేసుకుంటూ సమాధిస్థితిని పొందాను. ఆ స్థితిలోనే పెద్ద వెలుగు దర్శనం అయింది. ఆ వెలుగును చూడలేక పోయాను. అమ్మా! జగన్మాతా! నాకేమీ కనిపించటం లేదు అని మొరపెట్టుకున్నాను. క్రమేపీ ఆ వెలుగు తగ్గి, జగన్మాత దర్శనం అయింది. ఒక చేతిలో ఖడ్గం, ఒక చేతిలో బాణం, ఒక చేతిలో గదతో అభయాన్ని ప్రసాదించింది. నీలి వర్ణంలో వున్న అమ్మ దర్శనం అమోఘం, అద్వితీయం, అనిర్వచనీయం. అమ్మను వదలలేక అమ్మ పాదాలను చుట్టేశాను. అలా ఎంతసేపు వున్నానో తెలియదు, తరువాత యథాస్థితికి వచ్చేశాను. స్వామీ! మీ అపార కరుణ లేనిదే నాకీ అనుభవం కలిగేది కాదు. నా జన్మ ధన్యమైనది. తమకు శిష్యుడిపైన ఎంత ప్రేమ!' అంటూ ఆనంద భాష్పాలతో గురుదేవుల పాదాల మీద వ్రాలిపోయాడు ఇందీవరుడు.

మరునాడు స్వామి ప్రబోధానంద తమ ఆసనం మీద ఆసీనులయ్యారు. శిష్యులు తమకు బోధించిన విషయాలను వల్లేవేసుకుంటూ వున్నారు. స్వామి ఇందీవరుణ్ణి పిలిచి, 'ఇందీవరా! నిన్నటి రోజున నీవు అనుభవిస్తున్న అలౌకిక ఆనందాన్ని భగ్నం చేయటం ఇష్టంలేక నిన్ను అడగలేదు. ఇప్పుడు చెప్పు. నిన్న నీవు జగన్మాత దర్శనం పొందటానికి చేసిన సాధన ఏమిటి? ఎలా చేశావు?' చుట్టూ వున్న శిష్యులు దగ్గరకు చేరి

శ్రద్ధగా వింటున్నారు. ఇందీవరుడు సమాధానం చెబుతూ 'స్వామీ! తమరు ఎప్పుడూ చెబుతూ వుంటారు సత్యాన్ని మాత్రమే పలకాలని, మాట్లాడే ప్రతిమాట మృదువుగా, ప్రేమగా, పవిత్రంగా వుండాలని. సమయం అత్యంత విలువైనదని, దాన్ని వృథా చేసుకోరాదని తమరు చెప్పిన ఈ మాటలనే ఆచరణలో పెట్టుకున్నాను. ఆశ్రమానికి వచ్చిన తరువాత ఇన్ని సంవత్సరాలలో ఒక్కసారి కూడా అసత్యం పలుకలేదు నేను. నాతోటి విద్యార్థులతో పవిత్రమైన మాటలనే మాట్లాడుతూ వారి ఎడల దయకలిగి వుండేవాడిని. మాటలు కూడా చాలా తక్కువగానే మాట్లాడే వాడిని. ప్రతిరోజూ రాత్రి నిద్రపోయే ముందు ఈ రోజు నా సాధన ఎంతవరకు జరిగింది, ఎలా జరిగింది, ఏమైనా పొరపాట్లు చేశానా, ఎవరినైనా దూషించానా, ఎంత సమయం వృథా చేశాను .... అనే విచారణ చేసుకునేవాడిని. ఇలా సాధన జరుగుతుండటంతో మనస్సు శుద్ధి చెంది, అంతఃకరణ నిర్మలమైనది. సహాధ్యాయుల యందు అమితమైన ప్రేమ ఏర్పడింది. ఎప్పటికప్పుడు తమ బోధలను విచారించుకుంటూ, సమయం వృథా కాకుండా సాధన చేసుకునే వాడిని. తమయందు అత్యంత విశ్వాసాన్ని పెంపొందించుకున్నాను. అన్యథా శరణం నాస్తి అని తమను నిత్యం వేడుకుంటున్నాను. తమరే మార్గదర్శకత్వం వహించి నా సాధనా మార్గాన్ని నిర్దేశించారు. అప్పుడప్పుడు భగవద్దర్శనం కాలేదని నిరాశ పడుతూ వుండేవాడిని. తమరు వెంటనే తమ బోధ ద్వారా నేను నా సాధనను ఎలా ముందుకు తీసుకుని వెళ్ళాలో తెలియజేసేవారు. తమరు ఎప్పటికప్పుడు నాకు మార్గదర్శకత్వం వహిస్తుంటే, తమరు నిత్యం నా వెంటే వున్నారని నిరూపించబడేది. స్వామీ! తమరు దయాళువై ఈ శిష్యుడి యందు ప్రేమతో జగన్మాత దర్శన భాగ్యాన్ని ప్రసాదించారు. తమ అనుగ్రహం లేనిదే ఇది సాధ్యం కాదు. ఇందులో నా ప్రతిభ ఏమాత్రం లేదు' అని చెబుతూ గురుదేవులకి సాష్టాంగ నమస్కారం చేశాడు.

'ఇందీవరా! నీ శ్రద్ధ, భక్తి విశ్వాసాలు నన్నెంతో ఆకర్షించాయి. భగవత్సాక్షాత్కారం పొందాలనే నీ పట్టుదల నన్ను ముగ్ధుణ్ణి చేసింది. అందుకే ఎప్పటికప్పుడు నిన్ను కనిపెడుతూ, నీకు సాధన మార్గాన్ని అందించేవాడిని. చిరంజీవుల్లారా! మీరు ఏదైనా సాధించాలంటే గురువు యొక్క ఆవశ్యకత ఎంతో ఉంది. గురుదేవుల యందు విశ్వాసాన్ని పెంపొందించుకొని, వారి సూచనలను పాటిస్తూ, సాధన చేసుకునేవారికి లభించనిది ఏదీ వుండదు. ఇందీవరా! ఇహ నీ విద్యాభ్యాసం పూర్తి అయింది. అయినా నీవు ఇప్పుడే ఆశ్రమం విడిచి వెళ్ళనవసరం లేదు. నీవు ఇక్కడే వుండి, మిగిలిన విద్యార్థులకు విద్యను బోధిస్తూ నీ సాధనను కూడా మరింత పటిష్టం చేసుకో. నీవు తప్పక వెళ్ళాలి అనుకున్నప్పుడు నిరభ్యంతరంగా వెళ్ళదువుగాని' అని ముగించారు గురుదేవులు ప్రబోధానంద స్వామి.

## శ్రీ బాబూజీ మహరాజ్ అనుగ్రహముతో
## శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారి పర్యవేక్షణలో జరుగనున్న
## 'హరేరామ నామ సంకీర్తన, సత్సంగ సప్త సప్తాహాలు'
## భక్తులకు విజ్ఞప్తి

పైన వివరించిన కార్యక్రమాలు శ్రీఅన్నవరం శ్రీ సత్యదేవుని సమక్షంలో ప్రారంభమై, పంచారామాలలో జరిగిన తరువాత చివరిగా శ్రీకాళీవనాశ్రమంలో సంపూర్ణం చేయబడతాయి. ఈ విషయం భక్తులందరికి కరపత్రములు (పేంప్లెట్స్) ద్వారా తెలియపరచటమైనది.

కార్యక్రమ వివరములు : తె జా 4 గం.లకు సుప్రభాతం; 4గం 30 ని.లకు ప్రార్ధన; 9గం.లనుండి 10 గం.ల వరకు శ్రీశ్రీనివాస రామానుజదాసు గారి ప్రవచనము;11 గం.లకు మరియు సాయంత్రం 6 గం.లకు శ్రీ మాతాజీ మరియు మహాత్ముల అభిభాషణము ఉంటాయి. ఈ సప్తాహాలలో భాగంగా అఖండ హరేరామ నామ సంకీర్తన ఉంటుంది.

సప్త సప్తాహాల వివరణ : 1. ది.23.3.2019 నుండి ది,30.3.2019 వరకు **అన్నవరం శ్రీ సత్యన్నారాయణ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో** ; 2. ది. 24.04.2019 నుండి ది. 01.05.2019 వరకు కుమారారామం, సామర్లకోటలో ; 3, ది. 20.05.2019 నుండి ది.27.05.2019 వరకు భీమారామం, ద్రాక్షారామంలో ; 4. ది.05.08.2019 నుండి ది.12.08.2019 వరకు సోమారామం, భీమవరంలో ; 5. ది.08.09.2019 నుండి ది.15.09.2019 వరకు క్షీరారామం, పాలకొల్లులో ; 6.ది.18.10.2019 నుండి ది.25.10.2019 వరకు అమరారామం, అమరావతిలో ; మరియు 7. ది.15.11.2019 నుండి ది.23.11.2019 వరకు శ్రీగురు ఆరామం,శ్రీ కాళీవనాశ్రమం (నంబూరు)లో జరుపబడుతాయి.

భక్తులందరూ బహు సంఖ్యాకంగా విచ్చేసి, ఈ కార్యక్రామాలను జయప్రదం చేయమని ప్రార్థిస్తున్నాము. ఈ కార్యక్రమాలలో భక్తులందరికి ఉదయం భోగ ప్రసాద వితరణ, మధ్యాహ్నం, రాత్రి మహా ప్రసాద వితరణ ఉంటాయి. భారీ ఎత్తున జరిగే ఈ కార్యక్రమాలు ఎంతో వ్యయ ప్రయాసలతో కూడినవి. కావున భక్తులు ఈ విషయాన్ని గుర్తించి, ధన రూపంలోను, తమ అమూల్యమైన సేవలరూపంలోను తమ సహాయ సహకారాలను అందించమని భక్తులను ప్రార్థిస్తున్నాము. భక్తులు ఇచ్చే విరాళాలకు ఐ.టి యాక్ట్ 80 జి రాయితి ఉంటుందని తెలియజేస్తున్నాము.

పూర్తి వివరాలకు ట్రస్ట్ ఆఫీస్ 0863 - 2293564;
కె.మురళీమోహన వర్మ సెల్ - 9393334345 మరియు
కుమార స్వామి రాజా సెల్ - 9346535357లను సంప్రదించగలరు.

# వివేచనాశక్తిని పెంపొందింపజేసే జెన్ కథలు

## జెన్ సంభాషణ - రమణ ప్రసాద్

జెన్ టీచర్లు తమ స్టూడెంట్స్‌తో తమలో కలిగిన భావాలను వ్యక్త పరచే విధానం అలవరచుకోమని ప్రేరేపించేవారు:

ఇద్దరు జెన్ టీచర్లు ఉన్నారు. వారిరువురికి ఒక్కొక్క కుమారుడు ఉన్నారు. వారిలో ఒకడు ఉదయం కూరలు తేవడానికి వెళ్తూఉంటే రెండవ వాడు ఎదురయ్యాడు :

మొదటివాడు : ఎక్కడికి వెళ్తున్నావు?

రెండవవాడు : నా కాళ్ళు ఎక్కడికి తీసుకెళ్తే అక్కడికి. (ఇది మొదటివాడికి అర్థం కాలేదు. టీచర్‌ని అడిగాడు. ఆయన "రేపు మళ్లీ ఇదే ప్రశ్న అతనిని అడుగు. నీకు ఇదే సమాధానం ఇస్తాడు. అప్పుడు నువ్వు "నీకు కాళ్ళే లేకపోతే ఎక్కడికి వెళ్తావు?" అని అడుగు" అన్నాడు.) ఆ మర్నాడు :

మొదటివాడు :ఎక్కడికి వెళ్తున్నావు?

రెండవవాడు : గాలి ఎటువైపు వీస్తే అటువైపుకి (ఈ సమాధానం అర్థం కాక మళ్ళీ టీచర్‌ని అడిగాడు. ఆయన, "గాలి లేకపోతే ఎక్కడికి వెడుతున్నావు?' అని అడుగు" అన్నాడు. ఆమర్నాడు:

మొదటివాడు: ఎక్కడికి వెడుతున్నావు?

రెండవవాడు : కూరలు కొనడానికి.

(సత్య శోధనకు విచారణ అవసరం అంటారు శ్రీమాతాజీ)

## జెండా రెప రెపలాడుతోంది

ఇద్దరు జెన్ సన్యాసులు రోడ్డు మీద నడుస్తున్నారు. గాలి తీవ్రంగా వీస్తోంది. వారిలో ఒకడు, "చూడు ! జెండా గాలిని రెపరెపలాడిస్తోంది." అన్నాడు. రెండవవాడు : "తప్పు! గాలి జెండాను రెపరెపలాడిస్తోంది" అన్నాడు. వారీవిధంగా వాదించుకుంటుండగా జెన్ మాస్టర్ అక్కడకు వచ్చాడు. వీరు పరిగెట్టుకుంటూ ఆయన దగ్గరకు వెళ్ళి, రోషీజీ !"చూడండి! నేను జెండా గాలిని రెపరెపలాడిస్తోంది." అన్నాను. ఇతడేమో లేదు, గాలి జెండాను రెపరెపలాడిస్తోంది" అంటున్నాడు. మాలో ఎవరు చెప్పింది సరైనదో దయ చేసి చెప్పండి." అన్నారు.

ఆయన," మీ ఇద్దరు చెప్పేదీ తప్పే! మీ మనస్సులు రెపరెపలాడుతున్నాయి." అన్నాడు.

# మరణించినవాని సమాధానం

"మామియా" బాలుడిగా ఉన్నప్పుడు జెన్ టీచర్ వద్దకు శిక్షణకోసం వెళ్ళాడు. (కాల క్రమాన మామియా పెరిగి జెన్ ప్రవక్త అయ్యాడు).

జెన్ టీచర్ అతనిని "ఒక చేత్తో వచ్చే శబ్దం ఎలా ఉంటుందో?" చెప్పమన్నాడు.

మామియా ఒక చేతితో వచ్చే శబ్దం ఎలా ఉంటుందా? అనే ఆలోచనలో పడ్డాడు. ఎంత సేపటికి సమాధానం రాకపోవటంతో, "నీకు తిండిమీద ధ్యాస ఎక్కువైంది. డబ్బు, ఇతర వస్తువులు కావాల్సి వచ్చాయి. నేను అడిగిన దానికి నీ సమాధానం చెప్పలేదు. నువ్వు చచ్చిపోతే మంచిది. అప్పుడు ఈ ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది" అన్నాడు.

ఆ మర్నాడు మామియా టీచర్ వద్దకు వచ్చినప్పుడు ఆయన అదే ప్రశ్న వేశాడు.

మామియా ఉన్నట్లుండి క్రింద పడిపోయాడు.

"సరే చచ్చిపోయావు. మరి శబ్దం మాట ఏమిటి?"

" ఆగండి! నేనింకా సమాధానం వెదుకుతున్నాను."

" చచ్చినవాడు మాట్లాడడు. గెటౌట్ "

('ఆత్మానందం బ్రతికి ఉండగానే అనుభవించాలి, చచ్చిపోయాక వచ్చేది ఎత్తిపోతలే' అనేవారు శ్రీబాబూజీ మహరాజ్)

---

శ్రీ భగవాన్ ఉవాచ ..........

**" సర్వధర్మాలను పరిత్యజించి, నన్నే శరణు పొందు.**
**నేను నిన్ను అన్ని పాపముల నుండి విడిపిస్తాను.**
**శోకింపకు."**

- భగవద్గీత

# శ్రీశైల శిఖర దర్శన మహిమ - గాలి జగదీశ్

ఒకసారి కైలాసంలో పార్వతీదేవి శంకరుణ్ణి "స్వామీ! 'శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే' అని చెప్పుచున్నారు కదా! ఆ శిఖర దర్శనం చేసినంత మాత్రముననే వారందరూ జన్మలేకుండా ముక్తిని పొందుతారా?" అని ప్రశ్నించినది. దానికి పరమేశ్వరుడు "పార్వతీ! అట్లు ముక్తిని పొందగలిగేవారెవరో నీకు స్వయంగా చూపిస్తాను. శివరాత్రికి వేలకొలది భక్తులు శ్రీశైలయాత్రకు వెడతారు కదా! ఆ దారిలో మనమిద్దరము వృద్ధ దంపతుల వేషంలో వెడదాము. అక్కడే ఉన్న పాడుబడిన బావిలో నేను పడిపోతాను. నువ్వు ఏడుస్తూ 'ఎవరైనా వచ్చి, నా భర్తను బావిలో నుండి బయటకు తీసి రక్షించండి మీకు పుణ్యం ఉంటుంది' అని ఏడుస్తూ ఉండు. లేవదీయటానికి ఎవరైనా ముందుకు వస్తే వారిని నీవు ' నీవేమైనా పాపం చేసి వుంటే కనుక నా భర్తను తాకరాదు' అని చెబుతూవుండు. అప్పుడు నిజమైన భక్తులెవరో, ముక్తులయ్యేవారెవరో నీకే స్వయంగా తెలుస్తుంది" అని చెప్పి ఇద్దరూ కలిసి ఆ ప్రాంతానికి చేరుకున్నారు.

నిర్ణయించుకున్న పథకం ప్రకారమే శివుడు బావిలో వున్నాడు, పార్వతి ఏడుస్తూ వచ్చేపోయే వారిని నా భర్తను రక్షించమని అడుగుతూ కూర్చుంది. తీరా ఎవరైనా దగ్గరకు రాగానే వారిని నువ్వేదైనా పాపం చేసి వుంటే కనుక నా భర్తను తాకరాదు అని కూడా చెప్పసాగింది. దానితో భయపడి ముందుకు వచ్చినవారు కూడా 'నాకెందుకులే లేనిపోని గొడవ. నేను ఎన్నో పాపాలు చేశాను' అనుకుంటూ వెనక్కి వెళ్ళిపోతున్నారు.

ఇంతలో ఒక వేశ్య అటుగా వస్తోంది. ఆమె ఈ పార్వతి ఆర్తనాదం విని, ఆమె భర్తను రక్షించడానికి చేయి అందించి లేవదీయటానికి నూతి దగ్గరకు వచ్చింది. పార్వతి ఆమెను చూసి ఇదే విధంగా 'నువ్వేమైనా పాపం చేశావా? చేస్తే కనుక నా భర్తను తాకరాదు' అని అడిగింది. దానికి ఆ వేశ్య అచంచల విశ్వాసంతో సమాధానం చెబుతూ "నేను ఇంతవరకూ ఎన్ని పాపాలు చేసినా కూడా, ఇప్పుడు శ్రీశైల శిఖర దర్శనం చేశాను. దాని ద్వారా నా సమస్త పాపరాశి దగ్ధమైపోయింది. ఇక

నాకెక్కడిది పాపము?" అని చెప్పి, ఆ వృద్ధ బ్రాహ్మణునికి తన చెయ్యి అందించి, నూతిలో నుండి బయటకు తీసి, తనదారిన తాను వెళ్ళిపోయింది. అంతట పరమేశ్వరుడు పార్వతితో "ఓ పార్వతీ! చూశావా? శ్రీశైల యాత్రకు వచ్చిన వేలాదిమంది భక్తులలో ఈ వేశ్య ఒక్కతే 'శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే' అని గాఢంగా నమ్మినది. ఆమె మనస్సులో లేశమాత్రము కూడా ఎటువంటి సంశయము లేదు. కాబట్టి వచ్చిన వేలాది భక్తులలో ఈ వేశ్య ఒక్కతే సర్వపాపములు నశించి ముక్తురాలు అగుచున్నది" అని చెప్పగా, పార్వతి మరల ఆశ్చర్యపోయింది.

'శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే' - ఈ విషయంలో ఏమాత్రమైన సంశయం, అనుమానం వున్నా కూడా వాడు జీవితంలో కడతేరలేడు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

ఫిబ్రవరి 2019

10 ఆదివారం - మాఘ శుద్ధ పంచమి - శ్రీ సద్గురు క్షీర శిలామూర్తుల ప్రతిష్ఠా చతుర్థ వార్షిక మహోత్సవము - ఉదయం 11గం.లకు శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

12 మంగళవారం - రథసప్తమి - సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

16 శనివారం - భీష్మఏకాదశి సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

19 మంగళవారం - మాఘ(గురు) పూర్ణిమ, సాయంత్రం 5గం॥30నిలకు సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

28 గురువారం - శ్రీగురుదశమి -సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

మార్చి 2019

4 సోమ - మహాశివరాత్రి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

20 బుధ - పౌర్ణమి - హోళీ - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

30 శని - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

ఫిబ్రవరి 2019

02 శని - మాస శివ రాత్రి, పావులూరు శాఖలో ఏకాహం.

04 సోమ- అమావాస్య.

12 మంగ - రథ సప్తమి

16 శని - భీష్మ ఏకాదశి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

19 మంగ -గురు (మాఘ) పూర్ణిమ, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన.

28 గురు - శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

మార్చి 2019

4 సోమ - మహాశివరాత్రి - తె.జా 3-30ని॥ శ్రీబాబుకు బృందావనంలో నమకచమక సహిత రుద్రాభిషేకము; 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ, 8గం. శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో సామూహిక ఏకాదశ రుద్రాభిషేకములు; మధ్యాహ్నం 12గం. సహస్రఘటాభిషేకము; లక్ష బిళ్వార్చన; తీర్థప్రసాద వితరణ; భక్తసమారాధన. రాత్రి 7గం.లకు శ్రీ ఉమామహేశ్వరస్వామివారి సామూహిక కళ్యాణ మహోత్సవం; అనంతరం స్వామివారి నగరోత్సవం.

6 బుధ - అమావాస్య

9 శని - ఫాల్గుణ శుద్ధ తదియ - శ్రీ లలితానంద సరస్వతీస్వామిని వారి ఆరాధన, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

11సోమ - ఫాల్గుణ శుద్ధ పంచమి - శ్రీ విజయేశ్వరానంద స్వామివారి ఆరాధన.

20 బుధ - పౌర్ణమి - హోళీ - శ్రీసద్గురుపాదపూజ.

30 శని - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

**ద్వితీయాశ్వాసము - 80 వ శ్లో॥**

**సంసారే కింసారం**
**కంసారే శ్చరణ కమల పరిభజనమ్**
**జ్యోతిః కిమన్ధకారే**
**యదన్ధకారే నామస్మరణమ్ ॥**

తాత్పర్యము -

తెల్లవారి లేచిన దగ్గర్నుంచీ రాత్రి పడుకునే వరకు సంసారంలో ఎన్నో కష్టసుఖాలు అనుభవిస్తున్నాము కదా! ఎన్నో సమస్యలు ఎదుర్కుంటున్నాము. మరి నాకో సందేహం కలుగుతోంది. ఈ సంసారంలో సారమేమిటి? అని ఒక గృహస్థు మరొక గృహస్థుని అడుగుతుంటే ఆ సమయంలోనే వారి దగ్గరగా ఒక సాధు మహాత్ముడు వచ్చాడు. “ఆగండి! మీ అనుమానానికి నేను సమాధనం చెబుతాను” అన్నాడు. వారిద్దరూ ఆయనవంక చెప్పమన్నట్లుగా చూశారు. “ఈ సంసారంలో సారం కంసవైరి అయిన శ్రీకృష్ణుని పావన చరణ కమల పరిభజనమే” అన్నారాయన.



“మరి అజ్ఞానమనే చీకటి ముసురుకున్న మనస్సులలో ఆ నమ్మకం లేకపోతేనో!” అన్నారు వారిరద్దరూ.

“అజ్ఞానమనే అంధకారానికి వెలుగు స్వామి నామస్మరణమే! చీకటిలో వెలుగైనది జ్యోతి స్వరూపుడైన మాధవుని స్మరణమే!” అని చెప్పగానే ఆ గృహస్థులిద్దరూ సంతోషపడ్డారు. ఇక నుంచీ మనం దైవనామ స్మరణ, భజన మరువకూడదు సుమా! అని చెప్పుకుని తేలికగా ఊపిరి పీల్చుకున్నారిద్దరూ.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

త్రివేదాచార్య శ్రీ శాస్త్రిగారు సద్గురుదేవులని ప్రశ్నిస్తూ 'మానవుడు మృత్యువుని జయించే మార్గమే లేదాండి?' అని అడిగారు. శ్రీసద్గురు దేవులు మాట్లాడుతూ "నేను మిమ్మల్ని ఒక ప్రశ్న వేస్తాను. దానికి సమాధానం చెప్పండి. మీ ప్రశ్నకి సమాధానం తప్పక లభిస్తుంది" అన్నారు. తిరిగి గురుదేవులు ప్రశ్నిస్తూ "మానవుడు తన దేహ త్యాగం చేసినప్పుడు



తన సర్వస్వాన్ని అంటే ధనధాన్యాదులని, గృహాన్ని, భార్యా పుత్రులని, పదవులని, భూములని అన్నింటిని వదిలి వెళ్ళిపోతున్నాడు కదా! అది త్యాగమే కదండి మరి తిరిగి జన్మకి ఎందుకు వస్తున్నాడు? మీరు మూడు వేదాలను ఆమూలాగ్రంగా పఠించారు కదా! అందులో ఎక్కడన్నా ఏవైనా వివరణ వుందా! అని ప్రశ్నించారు.

శాస్త్రిగారు మాట్లాడుతూ 'నాకు తెలిసినంత వరకూ దీని గురించి ఎక్కడా వివరణ లేదు. అలాంటిది ఏదైనా వుంటే మీలాంటి పెద్దలు తెలియజేయవలసినదే. మానవుడు కర్మకు బద్ధుడై జన్మకు వస్తున్నాడని మాత్రం చెప్పగలను' అన్నారు.

శ్రీసద్గురుదేవులు మాట్లాడుతూ "తన ధన బలంచేతగాని, తన కీర్తి ప్రతిష్ఠలచేతగాని, బంధుమిత్రుల సహాయసహకారాల చేతగాని, ఎన్నడూ అమృతత్వాన్ని సాధించలేడని కేవలం త్యాగం చేతనే అమృతత్వాన్ని సాధించ గలుగుతాడని ఉపనిషత్తు చెబుతోంది కదండీ. మానవుడు తన సర్వస్వాన్ని దేహత్యాగం చేసినప్పుడు త్యజించి వెళ్ళినా, తన వెంట వాసన, లేక హీన సంస్కారాన్ని వెంట తీసుకువెళ్తున్నాడు. వాసన అనేది మనస్సులో విక్షేపంగా బుద్ధిలో ఆలోచనగా అహంకారంలో క్రియా రూపుదిద్దుకుని వుంటుంది. వాసనే జన్మకి కారణం అవుతోంది.

నేను, నాది అనే మూలాజ్ఞానమే వాసన. అది జన్మకి తీసుకు రావటమే కాకుండా అవస్థాత్రయంలో చిక్కుకోవడానికి దోహదం చేస్తుంది. అంతేకాదు గుణాలకి దాసుడై ప్రాపంచిక విషయాదుల వలలో పడి

కర్మను మూటకట్టుకుంటాడు. కర్మఫలాన్ని అనుభవించాలి కదా! తత్ఫలితమే జన్మని ప్రాప్తింపజేస్తుంది. నేను, నాది త్యాగం చేయాలి. దాని ద్వారా అహంకార మమకారాలు నశిస్తాయి. అప్పుడు గురూపదేశము, గురుపదముల యందు ఆసక్తి, శ్రద్ధ కలుగుతాయి. నానాత్వం నశిస్తుంది. ప్రేమ, దాస్యభావన అలవడతాయి. వాసనలను అధిగమించాలంటే సమర్థులైన గురుదేవుల సమాశ్రయం అవశ్యం. వారు వాసనని జయించే కీలకాన్ని అందజేస్తారు. అంతవరకూ జనన మరణ విషవలయం నుండి విముక్తి అసంభవం.

జన్మకు వచ్చిన ప్రతివారూ దేహాన్ని త్యాగం చేయవలసినదే. అయితే జన్మ రాకుండా చేసుకునే ఉపాయాన్ని మానవుడు అన్వేషించాలిగాని, మృత్యువును జయించే మార్గాన్ని అన్వేషించడం వివేకవంతమైన చర్య ఎంతమాత్రం కాదు. ఎన్నో ఇక్కట్లకు గురియై తపస్సు ఆచరించిన రాక్షసులు ఎవరైనా ఎన్ని వరాలు పొందినా మృత్యువును జయించగలిగారా?" అన్నారు సద్గురుదేవులు.

వెలుగు నిచ్చుటయే దీపము యొక్క స్వభావము. దాని సహాయముతో కొందరు వంట చేసుకొంటారు, కొందరు దొంగతనము చేసి, దొంగ పత్రములు, దస్తావేజులు సృష్టిస్తారు. మరి కొందరు భాగవతము చదువుతారు. ఇది దీపము యొక్క దోషమా? అలాగే భగవంతుని దివ్యనామమును జపించి, కొందరు ముక్తిని పొందవలెనని ప్రయత్నిస్తుండగా, మరికొందరు తాము త్రవ్విన కన్నము పారుటకుగాను జపించిన పక్షమున అది భగవంతుని దోషమా?

పాదుకలు తొడుగుకుని ముండ్ల మీద నిరపయాముగా నడవగలవు. ఆధ్యాత్మిక జ్ఞానము అను పాదుకలు ధరించి తాపము అను ముండ్లతో కూడిన యీ సంసారమునందు సురక్షితముగా సంచరించగలవు.

మొసలికి ఎట్టి ఆయుధమును చొరశక్యము కానంతటి దట్టమైన చర్మముండును. అట్లే లౌకికునకు నీవెంత శ్రమపడి జ్ఞానబోధ చేసినను, వాని తలకెక్కదు.

- శ్రీ బాబూజీ

# సూక్ష్మంలో మోక్షం

- పాలూరి కాళీప్రసాద్

మనం సాధారణంగా మోక్షమంటే అదేదో పెద్దది, దానిని సాధించాలంటే మనం ఎంతో ఎదగాలి అనుకుంటాం. కానీ, ఈ సృష్టిలో చూస్తే పెద్ద పెద్ద ప్రాణులే త్వరగా బంధించబడతాయి. ఒక పులినో, జింకనో బంధించినంత తేలికగా, ఒక ఎలుకనో, చీమనో బంధించగలమా? అలాగే పెద్ద చేపలు తేలికగా వలలో పడతాయి. కానీ ఎంత చిన్న చేప అయితే, వలలో నుండి అంత తేలికగా, తప్పించుకో గలుగుతుంది. అసలు 'నేను చాలా పెద్దవాణ్ణి లేదా గొప్పవాణ్ణి' అనుకోవడమే పెనుమాయ. అంతకు మించిన బంధనం ఏముంటుంది? 'నేను చాలా చిన్నవాడిని, భగవద్భక్తుల దాసానుదాసుణ్ణి' అనుకోవడమే మోక్షానికి దగ్గరదారి.

సురస పెద్ద నోటిలో చిక్కినప్పుడుగానీ, లంకలో రాక్షసులు త్రాళ్ళతో తనను బంధించినప్పుడుగానీ, హనుమంతుడు సూక్ష్మ రూపాన్ని ధరించేకదా ఆ బంధనముల నుండి విడివడగలిగినది? 'సర్వహీన స్వరూపోహం' అని పరమాత్మ తత్త్వాన్ని తేజోబిందూపనిషత్ నిర్వచిస్తోంది. 'అణోరణీయాం' అయినవాడే 'మహతోమహీయాం' కాగలడు. అయితే మానవుడు ఈ సత్యాన్ని గుర్తించలేక లేనిపోని అహంకారాన్ని తెచ్చిపెట్టుకొని, 'నా అంతటి వాడు లేడు' అని విఱ్ఱవీగి చివరకు ఆ మాయకు బద్ధుడై అనేక జన్మలను ఎత్తుతున్నాడు. తన నిజస్థితియైన ఆత్మతత్త్వాన్ని గుర్తించిన నాడు అదే ఆత్మ తత్వం సర్వే సర్వత్రా వ్యాప్తమై వున్నదనే జ్ఞానం కూడా కలుగుతోంది. అప్పుడింక ఒకరు గొప్ప, ఇంకొకరు తక్కువ అనే భావన కలుగదు.

ఈ చరాచర సృష్టి అంతా పంచభూతాలతోనే నిర్మించబడి నప్పటికీ వివిధ నిష్పత్తులలో వాటివాటి కలయికవల్ల మనకు స్థూలంలో ఇవన్నీ వస్తుభేదాలతో కనిపిస్తున్నాయి. ఈ స్థూల దృష్టి వున్నంతకాలం ఒకటి ఎక్కువ, ఒకటి తక్కువ అనే భేద భావం తొలగదు. అదే మనం సూక్ష్మ దృష్టితో చూస్తే, సృష్టిలోని ప్రతి వస్తువూ, ప్రాణీ అణువులతోను, పరమాణువులతోనూ నిర్మితమైనవే కదా. మరి ఈ పరమాణువులన్నీ ఒకే విధమైన ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు, న్యూట్రాన్లతో ఏర్పడినవే కదా. ఇలా సైన్స్ ప్రకారం చూసుకుంటే, సర్వసమానత్వం మనకు గోచరిస్తుంది.

ఇక భక్తుడవై చూస్తే ఈ సమస్త సృష్టి పరమాత్మ నుండే వచ్చింది కదా! మరి ఇక హెచ్చుతగ్గులకు తావెక్కడ? మరి జ్ఞాని దృష్టితో చూస్తే ఈ సర్వమూ తన (పరమాత్మ) స్వరూపమే. ఇలా ఏవిధంగా చూసినా సరైన పరిశీలన చేసినవాడికి హెచ్చుతగ్గులు లేవని అర్థమౌతుంది.

మానవుడు ఈ సూక్ష్మదృష్టిని అలవరచుకోలేక కేవలం స్థూల దృష్టితో మాత్రమే చూసే అహంకార మమకారాలకు లోనై బంధనాలను కొని తెచ్చుకుంటున్నాడు. సూక్ష్మదృష్టి లేదా సూక్ష్మభావన అంటే దేనికీ అంటకపోవటం. '**యథా సర్వగతం సౌక్ష్మ్యాత్ ఆకాశం నోపలిప్యతే! సర్వత్రావస్థితో దేహే తథాత్మా నోపలిప్యతే**' అని భగవద్గీత చెబుతోంది. ఆకాశం సర్వవ్యాప్తమై వున్నా, దాని సూక్ష్మత్వం చేత దేనికీ అంటకుండా వుంటోంది. నిజానికి ఆకాశం కన్నా పెద్దది, విశాలమైనది ఈ సృష్టిలో ఏదీ లేదు కదా. అంత పెద్దదైనా దాని గుణం సూక్ష్మత్వం. అందుకే అది దేని చేతా బంధింపబడదు. అలాగే దేహమంతా వ్యాపించియున్నా తన సూక్ష్మత్వం చేత ఆత్మ కూడా దేనికీ అంటదు. దేనిచేతా బంధింపబడదు.

ఇదే సూక్ష్మంలో మోక్షమంటే. బంధన లేకపోవటమే మోక్షం కదా! నిజానికి మన నిజస్థితి సదా మోక్షస్థితి. అయితే అట్టి సదాముక్త యైన ఆత్మను నేననే సూక్ష్మాన్ని గుర్తించలేక ఈ స్థూలదేహం నేననే భ్రమలోపడి మనం బంధితులం అయ్యామని తలపోస్తాం. ముక్తిని కోరుకుంటాము. శ్రీ గురుదేవులు బోధించినట్లుగా 'ముక్తి అనేది పొందేది కాదు. అది నీ స్వరూపమై, స్వభావమై వున్నది. నువ్వు చేయ వలసినదల్లా దానిని గుర్తించడమే. 'దానికోసం మనం ఈ సూక్ష్మ దృష్టిని అలవరచుకోవాలి. ఆధ్యాత్మికంగా ఎదగడం అంటే సమానత్వదృష్టిని సాధించడమే. సమదృష్టి కలవాడే పండితుడని, జ్ఞానియని భగవద్గీతలో అనేకమార్లు చెప్పబడింది.

నేలమీద ఉన్నవాడికి కొన్ని ఎత్తుగానూ, కొన్ని పల్లంగానూ కనిపిస్తాయి. కానీ విమానంలో ఎంతో ఎత్తులో ఎగురుతున్న వాడికి ఈ భేదాలు తెలుస్తాయా? వాడికి క్రింద అంతా సమతలంగానే గోచరిస్తుంది. అలాగే ఆధ్యాత్మికంగా తక్కువ స్థాయిలో వున్నవాడే ఇంకా 'నేను గొప్ప, నువ్వు తక్కువ' అని మాట్లాడతాడు కానీ ఉన్నతిని సాధించిన వాడు ఎన్నడూ ఈ తరతమ భేదాలు చూడడు.

## కోతి

- వంకిన బాబు

కోతులు పుట్టిందెందుకురా? - కొమ్మలు తుంచేటందుకురా!
కొమ్మలు తుంచేదెందుకురా? - రథములు చేసేటందుకురా!
రథములు చేసేదెందుకురా? - రాముడు తోలేటందుకురా!
రాముడు తోలేదెందుకురా? - లంకకు చేరేటందుకురా!
లంకకు చేరేదెందుకురా? - రావణుని చంపేటందుకురా!
రావణుని చంపేదెందుకురా? - సీతను తెచ్చేటందుకురా!
సీతను తెచ్చేదెందుకురా? - అయోధ్య చేరేటందుకురా!
అయోధ్య చేరేదెందుకురా? - భజనలు చేసేటందుకురా!
భజనలు చేసేదెందుకురా? - ముక్తిని పొందేటందుకురా!

పగలంతా పనీపాటా చేసి అలసిసొలసిపోయిన పామర జనం సాయంత్రానికి దేవాలయం దగ్గర గుమిగూడి పారవశ్యంతో పాడుకునే పాట ఇది. ఒకప్పుడు గ్రామాలలో ఇలాంటి పాటలు, దృశ్యాలు విస్తృతంగా కనిపించేవి, వినిపించేవి. ఆ తాళాలతో భక్తులంతా తన్మయత్వంతో తనువులు మరచి రామాయణాన్ని గానం చేసేవారు. ఇందులో పైకి కనిపించే అర్థం రామాయణమే. అంతరార్థం వేరే ఉంది. అదేమిటంటే .......... ఈ పాటలోని కోతులం మనమే. మనం ఎందుకు పుట్టామంటే సంసారమనే వృక్షం యొక్క కొమ్మలవంటి వాసనలతో తయారైన మనసనే రథానికి రాముడిని (గురుదేవుని) సారథిని చేసి, శరీరమనే లంకలోని కామమనే రావణాసురుని చంపి, జీవాత్మయైన సీతమ్మను తెచ్చి, పరమాత్మయైన రామునితో కలిపితే లంకవంటి మన శరీరమే అయోధ్య అవుతుంది. అందులో పట్టాభిషిక్తులైన సీతారాములను భజించి, సేవించి ముక్తిని పొందడానికే మనకీ జన్మ వచ్చింది.

చదువు వచ్చినవారు భాగవత రామాయణాలు చదివి తెలుసుకుంటారేమో గాని, పల్లెల్లో చదువురానివారికి ఇవే ధర్మోపదేశాలు. నిత్యమూ టి.విలలో చెప్పే ఉపన్యాసాలు, ఉపదేశాలు, వేదాలు, ఉపనిషత్తుల సారాన్ని వింటూ, అంతా తమకు అర్థమయిపోయిందని భ్రమిస్తూ ..... ఏళ్ళు గడుస్తున్నా ధర్మాన్ని తెలుసుకోలేని అర్థజ్ఞానులకంటే - నిర్మలమైన మనస్సుతో ఇలా భజనలు చేసేవారంటేనే భగవంతునికి ప్రీతి.

**సంతుష్ట స్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః।**
**మయ్యర్పిత మనోబుద్ధిః యోమద్భక్తస్సమే ప్రియః॥**

అన్నాడు గీతాచార్యుడు. ఎల్లప్పుడూ ఉన్నదానితో తృప్తిచెంది, తమ స్వధర్మాన్నే యోగంగా మార్చుకుని, జీవితంలో కలిగే కష్టసుఖాలను సమానంగా స్వీకరించి, నిశ్చయ బుద్ధితో, ఆ పరమాత్మ యందే మనస్సును అర్పణ చేసినవారే ఆ భగవంతునికి ఇష్టులు. ఆయనకు ఎంతో ప్రియమైనవారు.

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

ఫిబ్రవరి 2019

15 శుక్ర నుండి 19 మంగళవారం వరకు పంచాహ్నిక సత్సంగ సమావేశముల వివరములు :

నిత్యకార్యక్రమములు -

ఉదయం 5గం.లకు ప్రార్థన; 6-30ని॥ నగర సంకీర్తన; 7-30ని॥ భోగం, 9-30 గం. సంకీర్తన, 10గం.లకు శ్రీ రామానుజదాసుగారిచే ప్రవచనం, 11గం.లకు శ్రీసద్గురుదేవుల పాదపూజ, తీర్థ ప్రసాదములు తదుపరి భక్తసమారాధన..

సా॥ 5గం.లకు సంకీర్తన, 6గం. నుండి రాత్రి 8గం. వరకు సత్సంగ సమావేశములు, శ్రీమాతాజీవారి అనుగ్రహ భాషణము. తదుపరి ప్రసాద వితరణ.

ప్రత్యేక కార్యక్రమములు

15 శుక్రవారం - భీష్మ ఏకాదశి. ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ

16 శనివారం - సామూహిక కుంకుమ పూజలు, ఉదయం 11గం.ల శ్రీసద్గురు పాదపూజ.

17 ఆదివారం - ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ, రాత్రి 7గం. తెప్పోత్సవం.

18 సోమవారం - ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ.

19 మంగళ : మాఘ పౌర్ణమి - ఉదయం 11గం. శ్రీ సద్గురు పాదపూజ,

20 బుధవారం - ఉదయం మంగళహారతి.

28 గురు - శ్రీ గురుదశమి - రాత్రి 7 గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ.

మార్చి 2019

4 సోమ - మహాశివరాత్రి - రాత్రి 7 గం॥లకు శ్రీసద్గురుపాదపూజ

20 బుధ - పౌర్ణమి - హోళీ - రాత్రి 7 గం॥లకు శ్రీసద్గురుపాదపూజ.

30 శని - శ్రీగురుదశమి - రాత్రి 7 గం॥లకు శ్రీసద్గురుపాదపూజ.

# త్యాగం

- పాలూరి కాళీప్రసాద్

శ్రీ గురుదేవులు ఎప్పుడూ చెబుతూ వుండేవారు. గీతను అటు నుంచి ఇటు చదివితే తాగీ అవుతుంది. తాగీ అంటే త్యాగమనీ, గీతాసారమంతా త్యాగమేననీ. కేవలం త్యాగం ద్వారా మాత్రమే అమృతత్వం సిద్ధిస్తుందని ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి.

పూర్వం ఒక ఊరిలో ఒక సాధువుగారి ప్రవచనం పూర్తి కాగానే అందరూ లేచి వెళ్ళిపోయారు. కానీ ఒక వ్యక్తి మాత్రం అక్కడే ఇంకా కూర్చునే వున్నాడు. ఆ సాధువు అతనిని చూసి 'ఏం నాయనా! నీకు ఏమైనా కావాలా?' అని అడిగాడు. అప్పుడతడు 'స్వామీ! మీరు చెప్పినదంతా బాగానే అర్థం అయింది. కానీ అదేదో త్యాగం త్యాగం అని మాటిమాటికీ చెప్పారు. అంటే ఏమిటి స్వామీ!' అని అడిగాడు. అతని వాలకం చూస్తే పుశువులు కాసేవాడిలా వున్నాడని, ఆ సాధువు అతనికి అర్థమయ్యే ఉదాహరణలతోనే విషయాన్ని అందించాలని, 'నీ దగ్గర రెండు ఆవులు వున్నాయనుకో, అందులో ఒక ఆవును ఎవరికైనా ఇచ్చేస్తావా?' అని అడిగాడు. దానికతడు 'ఓ తప్పకుండా ఇస్తాను స్వామీ!' అన్నాడు. కానీ అతని వాలకం చూస్తే అతనికింకా పూర్తిగా విషయం అర్థం కాలేదనిపించింది. మళ్ళీ 'నీ దగ్గర రెండు గేదెలు వున్నాయనుకో, వాటిలో ఒక గేదెను ఎవరికైనా ఇచ్చేయగలవా?' అన్నాడు. దానికి కూడా అతడు 'ఓ తప్పకుండా ఇస్తాను స్వామీ!' అన్నాడు. ఇక ఆ సాధువు మరింత వుత్సాహంతో ' అలాగే నీ దగ్గర రెండు మేకలు వున్నాయనుకో, ఒక మేకను ఎవరికైనా ఇచ్చేయగలవా?' అని అడిగాడు. వెంటనే అతడు కంగారుగా, 'అలా ఎలా కుదురుతుంది స్వామీ! నేను ఇవ్వను' అన్నాడు. ఊహించని ఈ సమాధానంతో కంగుతిన్న ఆ సాధువు 'ఏం నాయనా! ఆవును, గేదెను ఇవ్వడానికి ఆనందంగా అంగీకరించినవాడివి, చిన్న మేకపిల్లను ఇవ్వడానికి కుదరదంటావే?' అని అడిగాడు. అందుకతడు 'మరి నా దగ్గర నిజంగానే రెండు మేకలు ఉన్నాయి స్వామీ! వాటిలో ఒకటి ఇచ్చేస్తే మరి నేనేమై పోవాలి?' అన్నాడు.

మన త్యాగం కూడా ఇలాగే వుంటుంది. మన దగ్గర లేనివి, వున్నా కూడా మనవి కానివాటిని త్యాగం చేయటానికి బాగానే ఉత్సాహం

చూపిస్తాము. కానీ మనదైన ఏ చిన్న విషయాన్ని కూడా మనం త్యాగం చేయలేము. త్యాగం అనగానే చాలా మంది 'నా తనుమనోధనాలు సర్వస్వాన్ని త్యాగం చేయడానికి నేను ఎప్పుడూ సిద్ధమే' అంటూ వుంటారు. అయితే ఇందులో తనువు మన స్వంతం కాదుకదా! మన తల్లిదండ్రుల ద్వారా వచ్చినది ఆ తరువాత ఎందరో రైతులు పండించి అందించిన ఆహారం తల్లి అందించడం వలన మన శరీరం ఇంతగా ఎదిగింది.

ఇక మనస్సు కూడా తనువుతో పాటు వచ్చినదే. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఇంకా సంఘంలో మనకు పరిచయమైన ప్రతి వ్యక్తి నుండి కొంత కొంతగా జ్ఞానాన్ని, అనుభవాలను గ్రహిస్తూ, ఇంతగా ఎదిగింది.

ఇక మనకున్న సంపద అంతా ఈ మనవి కాని తనువును, మనస్సును ఉపయోగించి సంపాదించినదే కదా! అయినా మనం పుట్టక ముందు మనవి కానివి, పోయేటప్పుడు మనతో తీసుకునిపోలేనివి అయిన ఈ తనుమనోధనాలను త్యాగం చేస్తే మనకు అమృతత్వం ఎలా సిద్ధిస్తుంది.

మరి జన్మజన్మల నుండి మనతో వచ్చేవి, మనకు మాత్రమే స్వంతమైనవి ఏవి? అవే విషయ వాసనలు, కర్మలు. మరి వాటిని త్యాగం చేయటం ద్వారా మాత్రమే అమృతత్వాన్ని పొందగలము. 'అదేమిటండీ! విషయ వాసనలు అంటే అవి విషయాలకు సంబంధించినవి కదా! మరి అవి మన స్వంతం ఎలా అవుతాయి? అని మీకు సందేహం రావచ్చు. అయితే మనం 'రంపపు పొట్టు' అంటాం కదా! అది ఎక్కడి నుండి వచ్చింది? దేనికి చెందినది? రంపానికి చెందినదయితే కాదు. చెక్క రంపానికి తనను తాను వశపరచుకోవటం ద్వారా ఆ చెక్క నుండి వచ్చిన పొట్టునే మనం రంపంపొట్టు అంటున్నాము. అలాగే విషయ వాసనలు కూడా విషయాదుల నుండి వచ్చినవి కాదు. ఆ విషయాలకు మనను మనం వశపరచుకోవడం ద్వారా మనలో కలిగే విషయ వాసనలు. ఇవి మనలను జన్మజన్మలకు వెంటాడతాయి. అందుకే వీటిని త్యాగం చేయడమంటే మనం విషయాలకు లొంగిపోకుండా వుండగలగటమే. అలాగే కర్మలను త్యాగం చేయడమంటే ఏ పనీ చేయకుండా కూర్చోవటం

కాదు. అలా కూర్చోవడం కూడా ఒక పనే కదా! అసలు కర్మలు చేయకుండా వుండటం ఏ ప్రాణికీ సాధ్యం కాదు.

మరి ఇందులో మనం త్యాగం చేయగలిగినదేమిటంటే, మనం కర్మ ఫలాన్ని త్యాగం చేయాలి. ముందుగా 'ఈ కర్మ చేసేది నేను కాదు. నాతో ఆ భగవంతుడే చేయిస్తున్నాడు' అనే విశ్వాసంతో కర్తృత్వ అహంకారం తొలగి పోతుంది. అలాగే 'ఈ కర్మ ద్వారా నేను పొందగోరేది ఏదీ లేదు. నాకు ఎప్పుడు ఏది అవసరమో అది ఆ భగవంతుడే నాకు ప్రసాదిస్తాడు. నేను కేవలం ఆయన ఆజ్ఞతో మాత్రమే ఈ కర్మను చేస్తున్నాను' అనే సర్వ సమర్పణ భావనతో భోక్తృత్వ అహంకారం తొలగిపోతుంది. అప్పుడే మనకు అమృతత్వం సిద్ధిస్తుంది. అదే నిజమైన త్యాగం!

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఫిబ్రవరి 2019, మార్చి 2019 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

ఫిబ్రవరి 2019: AS 1913, 5645, 6262, 6702, 6843, 6847, 6848, 7443, 7677,
AS 7682, 7734

మార్చి 2019 : AS 7070, 7451, 7454, 7455, 7457, 7685, 7687, 7689, 7690,
AS 7691, 7694, 7695, 7697, 7698, 7700 నుండి 7705, 7707,
AS 7709, 7711, 7719, 7721, 7722, 7723.

మేనేజరు

(గత సంచిక తరువాయి)

# కైవల్యోపనిషత్

- రేఖ

బ్రహ్మవిద్య ఉపాసనకు కావలసిన భక్తి శ్రద్ధ ధ్యాన యోగాదుల యొక్క ఆవశ్యకతను ఇంకా విపులీకరిస్తూ 'శాస్త్ర విషయములను, గురు వాక్యములను విచారణ చేసి, వాటిని అనుభవానికి తెచ్చుకుంటేనే బ్రహ్మవిద్య ఉపాసన చేసినట్లవుతుంది. అందువల్లనే బ్రహ్మదేవుడు అశ్వలాయన మహర్షికి చెబుతున్నాడు. ఈ అనుభవం అనేది సాధకుడైనవాడికి ఎలా వస్తుందో వివరించారు.

శ్రద్ధ అనేది బుద్ధి యొక్క వ్యవహారం. భక్తి అనేది హృదయము, లేక మనస్సు యొక్క వ్యవహారం. ఈ మనోబుద్ధులను ఏకం చేసే ప్రక్రియను ధ్యానము అంటారు. శాస్త్రమందు, గురువాక్యముల యందు ఉన్న ఉన్నత భావాలను విచారణ చేసి, విశ్వాసముతో ధ్యానము ద్వారా అనుభవానికి తెచ్చుకోగలుగుతాడు సాధకుడు. ఈ అనుభవమే ఆధ్యాత్మ జ్ఞానము - శిష్యుడు తను స్వయంగా అలవరచుకోవలసిన సహజ జ్ఞానం. ఈ జ్ఞానం వలన సృష్టి సర్వస్వం ఆ భగవంతుడే నడిపిస్తున్నాడు అనే సత్య దృష్టి కలుగుతుంది. సర్వభూత దయ ఏర్పడుతుంది. సర్వత్రా వ్యాపించి వున్న భగవంతుడిని చూడగలుగుతారు. ఇహ సుఖాల యందు వైరాగ్యం కలిగి వుంటాడు. కైవల్య స్థితిని గుర్తించడానికి కావలసిన బ్రహ్మ విద్యను ఇక్కడ ఆర్జించుకుంటున్నాము" అన్నారు శ్రీమాతాజీ.

ఈ ప్రయత్నంలో మనం కదలికలతో కూడుకున్న క్రియలకే ప్రాముఖ్యత ఇచ్చి ఆసక్తి చూపుతాము. ఉదాహరణకి పూజలు, ఊరేగింపులు, మహాత్ముల ప్రవచనాలు, ధ్యానము వంటివాటికి అలవాటు పడిపోయి వున్నాము. కాని కదలనిది ఒకటి విశ్వవ్యాప్తంగా వున్నది. ఏ కర్మచేతగాని, సంతానం చేతగాని, ధనముచేతగాని కాకుండా కేవలం త్యాగము ద్వారానే అమృతత్వాన్ని పొందగలమని బ్రహ్మదేవుడు ఈ ఉపనిషత్తులో చెబుతున్నాడు.

ఈ దృశ్య ప్రపంచానికి వెనుకనున్న ఆ పరతత్వాన్ని గ్రహించాలంటే, మనం ఈ ఇంద్రియాలను, మనోబుద్ధులను దాటిపోవాలి. అంటే వాటిని వదిలి పెట్టాలి. త్యాగం ఒక్కటే సరియైన సాధన. అప్పుడు నిత్యసత్యతత్వమైన ఆ పరమాత్మలో జీవాత్మ లయమై పోతుంది. దీనినే ఉపనిషత్తులో అమృతత్వస్థితి అని చెప్పారు. ఇది

శాశ్వతమైన మార్పులేని స్థితి. సంతానం వలన ఏవో ఉత్తమ లోకాలు ప్రాప్తిస్తాయి అనుకుంటారు. మరి పిల్లలు లేనివారి సంగతి ఏమిటి? అందువల్ల ఇదంతా హుళక్కే. భగవంతుడు ఏదిస్తే దానితో సంతృప్తిగా వుంటే జీవితం కూడా సుఖమయంగా వెళ్ళిపోతుంది. ధనముతో అమృతత్వాన్ని పొందలేము.

కోటీశ్వరుడు ప్రపంచంలో ఏదైనా కొనవచ్చు కాని బ్రహ్మవిద్యను కొనలేడు. పుణ్య సంపాదన అయి, దానితో ధర్మపరంగా కర్మ చేస్తే అది జీవితం సుఖమయంగా వుండటానికి సహాయ పడుతుంది. లేకపోతే దానివలన ఎంతో చెడు అనుభవించే అవకాశం వుంది. అనారోగ్యం, అశాంతిల పాలవుతాడు. అందువల్ల ఎంత ధనం సంపాదించినా తృప్తి వుండదు, సుఖం వుండదు. సంతానము, ధనము వున్నా, వాటి యందు మమకారం, వాటిమీద వున్న ఆప్యాయత త్యాగం చేస్తే అప్పుడు గొప్ప సుకృత ఫలితాన్ని, అమృతత్వాన్ని పొందుతాడు మానవుడు.

ధన త్యాగం గురించి శ్రీమాతాజీ ఈ విధంగా వివరించారు - ఏ దేవాలయాలతో, మహాత్ములకో ఆ ధనం సమర్పించమని కాదు అర్థం. దేవుడు ఇచ్చినదే ఆ ధనం. ఈ ధనంతో గుడిలో దేవుడి విగ్రహాన్ని చేయించినా, అలంకరణకు ఆభరణాలు చేయించినా అది చూసి ఆనందించేది భక్తులే. భగవంతుడివేవీ కోరలేదు. ఈ విషయం గుర్తుపెట్టుకోవాలని సూచించారు.

ఈ సమయంలో మీరంతా మీ ఇళ్ళల్లో టి.వి. చూస్తూ కాలం గడపవచ్చు. కానీ ఆ ప్రపంచాన్ని త్యాగం చేసి, ఈ సత్సంగంలో పాల్గొంటున్నారు అంటే మీరు ప్రపంచాన్ని తాత్కాలికంగా త్యాగం చేశారన్న మాట. సత్సంగంలో గడిపిన కాలమే నిత్యకాలంలో జమ అవుతుందని మహాత్ములు చెప్పారు. త్యాగం వలనే ఈ స్థితి కలిగింది. జ్ఞానేశ్వరి అనే గ్రంథంలో జ్ఞానదేవుడు సత్సంగం యొక్క విశిష్ఠత తెలిపారు. ఒకసారి ఆయన సత్యలోకానికి వెడితే అక్కడ బ్రహ్మదేవుడు లేడు. వైకుంఠంలో విష్ణుమూర్తి, కైలాసంలో మహేశ్వరుడు కూడా లేరు. ఏమయ్యారో వీరంతా అని చూస్తే త్రిమూర్తులు, దేవతలు అందరూ కూడా భూలోకంలో సత్సంగంలో పాల్గొనడానికి వెళ్ళారుట.

-సశేషం

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## బళ్ళారి శాస్త్రిగారితో శ్రీబాబు

- విజయేశ్వరానంద ప్రసాద్

ఈ సంఘటనను గూర్చి శాస్త్రిగారు వ్రాస్తూ “శ్రీ బాబు అద్వైత సామ్రాజ్య సార్వభౌములు. వారు మనలను రెచ్చగొట్టినా, కోపం నటించినా, ఒకవేళ తీవ్రంగా మాట్లాడినా, దానికి కారణం ఏమై వుండవచ్చుననేది జాగ్రత్తగా విచారణ చేస్తే గాని తెలియదు. మనలోనే , మనము తెలిసికొనలేని, అజ్ఞాన లక్షణములైన అహంకార మమకారములు మన కనులకు పొరలై కమ్మి మన లోపములను మనకు తెలియనీయక, సద్గురు దేవుల నిజ తత్త్వమును దర్శించనీయక అడ్డు పడతాయి. ఆ అజ్ఞానపు పొరలను జ్ఞానమనే కాటుక పుల్లతో శస్త్రం చేసి తొలగించి, సత్య వస్తువును దర్శింపజేసే అవ్యాజ కరుణామూర్తి శ్రీ బాబు. వారు సహజ ప్రేమ స్వరూపులు, నమ్మిన వారికి కొంగుబంగారము.



నిజముగా నాకు ఆ రోజున అహంకారమూ, కోపమూ, విసుగూ కలిగాయి. కాని అజ్ఞానం వలన మనం ఎన్ని తప్పులు చేసినా అన్నీ మన్నించి సరి దిద్ది, తన బిడ్డలను మంచి దోవలో పెట్టవలెననేదే స్వామి సంకల్పము. లక్ష్యార్థము నుండి మనస్సును పెడ త్రోవను పడనీయక, సద్గురు చరణారవిందముల యందలి భక్తిని సడలనీయక, విడువని పట్టుదలతో తన బిడ్డలందరూ లక్ష్యార్థమును సాధించి, తరించవలెననియే శ్రీబాబు ప్రగాఢ వాంఛ. అందుచేతనే భక్తులు తమను ఎన్ని శ్రమలు పెట్టినా, ఎంత విసిగించినా సహించి, క్షమించి మనలను కవ్విస్తూ, మళ్ళీ నవ్విస్తూ ఎన్నో రీతులుగా తన భక్తులను కాపాడుకుంటున్న భక్తజన చింతామణి శ్రీ బాబు. ఉపాధి రీత్యా వారు వేరుగా కనిపిస్తున్నా, మనందరిలోనూ ఉన్న ఆత్మ వారే. మనమే వారు; వారే మనము అన్న ఆత్మ విశ్వాసమును ఎన్నటికీ వీడరాదు. వారి యెడల మనము చూపవలసిన భక్తి విశ్వాసములు యివియే గాని, మన ధన ధాన్యాలతో

వారికి పని లేదు" అని ఆత్మ విమర్శ చేసుకున్నారు.

1966లో శాస్త్రిగారు యిండియన్ బ్యాంకులో ఉద్యోగ విరమణ చేశారు. వెంటనే వైశ్యా బ్యాంకు వారు శాస్త్రిగారిని తమ బ్యాంకులో మేనేజర్ పదవిలో నియమించుకుంటామని ఆహ్వానించారు. శాస్త్రిగారు ఓపిక లేదని వద్దనుకున్నారు. కాని శ్రీ బాబు "నేను మీకు ఓపిక, ఉత్సాహము అన్నీ యిస్తాను" అని ప్రోత్సహించి మరొక ఆరు సంవత్సరాలు శాస్త్రిగారిచేత ఉద్యోగం చేయించారు. "మీరు ఉద్యోగంలో ఉన్నపుడు ఎందరికో ఉద్యోగాలు యిప్పించారు. లక్షలు ఆర్జించే అవకాశం ఉన్నా, ఒక దమ్మిడీ కూడా అక్రమంగా తీసుకోకుండా, ఉత్తమ సేవా ధర్మాన్ని మీరు నిర్వహిస్తూ, సహోద్యోగులకు కూడా నేర్పారు. మీరు మరికొంత కాలం ఉద్యోగంలో ఉన్నందువలన, మీకు కొంచెం శ్రమ కలిగినా, ఎంతమందికో ఉపకారం జరుగుతుంది. కర్మలో అకర్మను చూసే సాధన కూడ మీకు లభిస్తుంది" అని శ్రీ బాబు చెప్పిన హిత వాక్యములు శాస్త్రిగారి హృదయంలో హత్తుకుపోయాయి.

శ్రీ బాబు సర్వజ్ఞులు; త్రికాల వేదులు; దేశకాల క్రియాతీతులు; సర్వ స్వతంత్రులు; పరమ దయామయులు. ఒకసారి శాస్త్రిగారు ఆశ్రమానికి వెళ్ళి వారం రోజులున్నారు. శెలవు అయిపోయిన రోజున బయలుదేరి వెళ్ళటానికి శ్రీ బాబు అనుమతిని ముందే పొందారు. ఆ రోజున శ్రీ బాబు బోధ జరుగుతుంటే, శాస్త్రిగారు తమ పెట్టె తీసుకుని, శ్రీ బాబుకు కనిపించి వెడదామని బోధ జరుగుతున్న హాలులోకి వచ్చారు. శ్రీ బాబు "అన్నగారూ! కూర్చోండి. ఇది మీరు వినవలసిన విషయం" అన్నారు.

శాస్త్రిగారు "బాబూ! రైలు టైము కావస్తున్నది. నాలుగు గంటలకే బండి. క్షమించండి" అంటుంటే "అవన్నీ నాకు తెలుసు లెండి సార్! ఈ ఒక్క పాయింటూ విని వెళ్ళండి" అంటూ రెండు గంటల సేపు, శాస్త్రిగారి వంక చూడకుండా, ఆయనకు మాట్లాడే అవకాశం యివ్వకుండా, అఖండమైన బోధ చేశారు. అప్పుడు తామే గడియారం చూసుకొని శ్రీ బాబు "అన్నగారూ! బండి టైము దాటిపోయినట్లుందే! ఫరవాలేదు, దొరుకుతుంది లెండి. వెళ్ళి రండి" అన్నారు.

-సశేషం

# సత్యకాముడు

- రవీంద్రనాథ్ టాగూర్

గౌతమ గురువు చూట్టూ ఆశ్రమ బాలురంతా ఆవులన్నీ తోలుకుని వచ్చి, అగ్నిహోత్రం ముందు కూర్చుని వున్నారు. ఓ కొత్తబాలుడు వచ్చి ఫలపుష్పాదులను సమర్పించి, గౌతమ మహర్షి పాదాలకు నమస్కరించి, 'అంతిమ సత్యాన్ని అందుకునే మార్గాన నన్ను ప్రవేశ పెడతారనే కోర్కెతో వచ్చాను. నా పేరు సత్యకాముడు' అని అన్నాడు.

'నీకు నా ఆశీస్సులు. వత్సా! నీవేజాతి వాడవు? బ్రహ్మవిద్యకు ఒక్క బ్రాహ్మణులే అర్హులు' అన్నాడు గౌతముడు. 'స్వామీ! నా వర్ణమేదో నాకు తెలియదు. మా అమ్మనడిగి వచ్చి చెబుతాను' అని వెళ్ళాడు సత్యకాముడు.

తల్లి కుటీరానికి చేరుకున్నాడు. గదిలో దీపం మసకగా వెలుగుతోంది. కుమారుడి రాకకై ఎదురు చూస్తూ, తలుపు దగ్గర చీకట్లో నిలబడి ఎదురు చూస్తోంది. బిడ్డను కౌగలించుకుని, శిరస్సుపై ముద్దు పెట్టి, 'నాయనా! గురువుగారి దగ్గరకు వెళ్ళిన పని ఏమైంది?' అని అడిగింది. 'అమ్మా! నా తండ్రి ఎవరు? ఆధ్యాత్మిక జ్ఞానానికి ఒక్క బ్రాహ్మణులే అర్హులని గౌతమ ఋషి సెలవిచ్చారు' అన్నాడు.

ఆమె కళ్ళు క్రిందకు వాల్చి, వినీ వినబడని మాటలతో 'నా యవ్వనంలో నేను దరిద్రురాలిని. నాకు ఎందరో నాధులు. భర్తలేని నీ తల్లి జాబాలి చేతుల్లోకి నీవు వచ్చావు' అని చెప్పింది.

ఉదయాన్నే లేచి, స్నానాలు చేసి, ఇంకా తడిగా వేలాడుతున్న జుట్టుతో శిష్యులు గురువు చుట్టూ కూర్చుని వున్నారు. ఓ పురాణ వృక్షం క్రింద. సత్యకాముడు వచ్చి ఋషి పాదాలకు నమస్కరించి, మౌనంగా నిలబడ్డాడు. 'ఏ జాతివాడవో తెలుసుకుని వచ్చావా?' అడిగాడు ఆ మహర్షి. "గురుదేవా! నాకు తెలియదు. మా అమ్మ 'నా యవ్వనంలో నేను దరిద్రురాలిని. నాకు ఎందరో నాధులు. భర్తలేని నీ తల్లి జాబాలి చేతుల్లోకి నీవు వచ్చావు' అని అన్నది" అని చెప్పాడు. కదలించిన తేనెతుట్టలాగ లేచారు శిష్యులంతా సణుగుతూ భరించలేమన్నట్లు.

గౌతమ మహర్షి తన ఆసనం మీద నుండి లేచి, రెండు చేతులూ చాచి, బాలుడిని తన హృదయానికి హత్తుకుని, "బాలకా! బ్రాహ్మణులలో నువ్వు ఉత్తముడివి! సత్య వంశ సంజాతుడివి" అన్నాడు కరుణాదృష్టితో.

(గత సంచిక తరువాయి) విష్ణు  కథలు - రమణ ప్రసాద్

# శ్రీ స్వామి వివేకానంద

ఒకసారి ఆయనతో నేను "మీరు దివ్యదర్శనాలలో గాంచే భగవంతుని రూపాదులు అన్నీ మీ చిత్త భ్రమలు" అని చెప్పాను. నా మాటల పట్ల ఆయనకు ఎంత విశ్వాసం ఉంది అంటే, ఆయన ఆలయంలో జగజ్జనని వద్దకు వెళ్ళి ఆమెతో నేను అన్న మాటలు చెప్పారు. "ఇవన్నీ చిత్త భ్రమలేనా?" అని ఆమెను ప్రశ్నించారు. తరువాత నాతో "అవన్నీ యదార్ధమే అని అమ్మ నాతో చెప్పింది" అని చెప్పారు. ఒకరోజు ఆయన ఏకాంతంలో నాతో చెప్పారు. 'నాకు సిద్ధులు ప్రదర్శించటం సుతరామూ ఇష్టం లేదు. కాని నీ ద్వారా ప్రదర్శిస్తాను, నువ్వు ఏమంటావు?' అన్నారు. నేను 'అందుకు వీల్లేదు మీరు అలా చేయలేరు' అని జవాబిచ్చాను."



"నా గురుదేవులనుంచి నేను నేర్చుకున్న మహోన్నత భావన ఏమిటంటే లోకంలోని యావన్మతాలూ పరస్పర విరుద్ధాలు కావు వ్యతిరిక్తాలు కావు. అది శాశ్వత మైన ఒకే సిధ్ధాంతపు వివిధ రూపాలు."

"ఒకరోజు గురుదేవులు నేను చదువుకుంటున్న గదికి వచ్చి జీవితాంతం బ్రహ్మచర్య వ్రతం పాటించమని నాకు ఉపదేశిస్తూండగా బయటనుంచి మా అమ్మమ్మ అంతా విని నా తల్లిదండ్రులకు ఆ విషయం చెప్పేసింది. ఆనాటి నుండి నాకు వివాహ ప్రయత్నాలు జరిగాయి. కాని గురుదేవుల సంకల్పం ముందు అవన్నీ విఫలమై నాయి."

"నా తండ్రి గతించాక నాతల్లి, సోదరులు పస్తులుండి కష్టపడ్డారు ఒకరోజు గురుదేవులు అన్నదాగుహను కలుసుకున్నప్పుడు ఆతడితో ఆయన ఇలా ఆన్నారు "నరేంద్రుడి తండ్రి మరణించాడు. అతడి కుటుంబం లేమితో

కొట్టుమిట్టాడుతోంది. మిత్రులు ఇప్పుడు అతడికి కొంత ధనసహాయం చేస్తే బాగుంటుంది" అని. అన్నాదా వెళ్ళిపోయాక ఆయనను నేను గద్దించి అడిగాను, "అవన్నీ అతడితో ఎందుకు చెప్పారు?"అని. నా కటువైన ఆ మాటలు విన్నాక ఆయన విలపిస్తూ, "అయ్యో! నీ కోసం నేను ఇంటింటికీ వెళ్ళి భిక్షం ఎత్తటానికి సిద్ధమే" అని అన్నారు.తన ప్రేమతో మమ్మల్ని ఆయన మచ్చిక చేసుకున్నారు."

నేను ఉద్యోగానికి చాలా ప్రయత్నాలు చేశాను. సహాయం చేయగలిగిన స్థితిలో ఉన్నవారు కూడా పెడముఖం పెట్టారు. నాకు భగవంతుడి మీద నమ్మకం సడిలింది. నేను నాస్తికుడనయ్యానన్న వార్త గురుదేవులకు చేరింది."

"నాకు సర్వసంగపరిత్యాగం చేయాలి అనిపించింది. ఆ రోజు శ్రీ రామకృష్ణులు ఒక భక్తుని ఇంటికి వస్తున్నారని తెలిసి ఆయన దర్శనానంతరం శాశ్వతంగా సంసారాన్ని పరిత్యజించ కోరాను. ఆ రాత్రి తనతో దక్షిణేశ్వరంలో గడపాలి అని ఆయన పట్టు పట్టారు. నేను గత్యంతరం లేక ఆయనతో వెళ్ళాను.

దక్షిణేశ్వరం వెళ్ళాక ఆయనకు పారవశ్య స్థితి కలిగింది. నన్ను స్పృశిస్తూ కళ్ళవెంట నీరు పెట్టారు. హృదయంలో పొంగి వస్తున్న ఉద్వేగ ప్రవాహాన్ని ఆపు చేసుకోలేక పోయాను. ఆయన నన్ను దగ్గరకు పిలిచి 'నాయనా! నువ్వు జగజ్జనని కార్యం నిమిత్తమే వచ్చావని నాకు బాగా తెలుసు. నువ్వు లౌకిక జీవితం గడపలేవు. అయినప్పటికీ నేను జీవించి ఉన్నంత కాలం నాకోసం నాతోనే ఉండు.' అన్నారు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL